# జనవాహిని

ప్రచురణ, తెలంగాణ, | సంపుటి -08 | సంచిక -62 శుక్రవారం 15-12-2023 | పేజీలు -4. | వెల రూ.2/-




8లో నా సామిరంగాలో అల్లరి నరేశ్




## పేదల బతుకులు మార్చాలనే తపన

- విశాఖకు వస్తానంటే కొందరు దొంగ ఏడుపులు
- పక్క రాష్ట్రంలో ఉంటూ ఇక్కడ రాజకీయాలు
- కుప్పంకే నిల్లవ్వలేని వ్యక్తి చంద్రబాబు
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై జగన్ విసుర్లు




## 222వ రోజుకు లోకేశ్ పాదయాత్ర


అంగన్‌వాడీల ధర్నాకు మద్దతు

# బాధ్యతలు స్వీకరించిన పలువురు మంత్రులు

- ఛాంబర్‌లో చేరిన డిప్యూటి సిఎం భట్టి
- ఆర్టీసీ,ఆరోగ్యశ్రీ, విద్యుత్ సబ్సిడీలకు నిధులు విడుదల
- తొలి విడతలోనే నిధులు విడుదల చేస్తే భట్టి సంతకాలు
- పొంగులేటి, శ్రీధర్ బాబు, సీతక్కలు కూడా బాధ్యతల స్వీకరణ









హైదరాబాద్,డిసెంబర్14
**జనవాహిని**
: తెలంగాణ మంత్రులు పలువురు గురువారం ఛాంబర్‌లలో ప్రవేశించారు. ప్రత్యేక పూజలు చేసి సచివాలయంలో తమకు కేటాయించిన కార్యాలయాల్లో చేరారు. ఆర్ధిక, ప్రణాళిక, విద్యుత్ మంత్రిత్వ శాఖల బాధ్యతలను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్వీకరించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు కల్పిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం సబ్సిడీని 374 కోట్ల రూపాయలు ఆర్టీసీకి విడుదల చేస్తూ డిప్యూటీ సిఎం భట్టి తొలి సంతకం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా 298 కోట్ల రూపాయలను వైద్య ఆరోగ్య శాఖకు విడుదల చేస్తూ రెండవ సంతకం చేశారు. విద్యుత్ సబ్సిడీ 996 కోట్ల రూపాయలు విడుదల ఫైలుపై సంతకం చేశారు. సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్ల కొరకు 75 కోట్ల రూపాయలు వివిధ శాఖల మంజూరుకు సిఫారసు చేసిన ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, పలువురు నేతలు భట్టికి అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యేలు కూనంనేని సాంబ శివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ,
బాలు నాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీ రెడ్డి తోపాటు పలువురు సీనియర్ నాయకులు అభినందించారు. మాజీ ఎంపి రేణుకా చౌదరి, రామసహాయం సురేందర్ రెడ్డి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార

- మిగతా 2లో పేజిలో

# నేటి నుంచి ఆర్టీసీ బస్‌లో మహిళలకు జీరో టికెట్లు

-: ఆర్టీసీ ఎండీ సజ్జనర్

2లో

(శుక్రవారం) నుంచి జీరో టికెట్లను జారీ

మహిళా ప్రయాణికులు తమ వెంట ఆధార్, ఓటరు, తదితర గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి



# విభజనతో కొంత... జగన్‌తో మరింత

- తీవ్రంగా నష్టపోయిన ఎపి
- పొత్తులతో అన్ని సీట్లు గెలవాలి
- కార్యకర్తలతో భేటీలో పవన్ కళ్యాణ్




# మెట్రో మార్గంలో మార్పులు

- రాయదుర్గం- ఎయిర్‌పోర్టు ప్లాన్ రద్దు
- కొత్త భవనాల నిర్మణాం ఉండదన్న సిఎం
- అందరితో చర్చించి అవసరమైనప్పుడు శ్వేత పత్రాలు
- నేటి గవర్నర్ ప్రసంగానికి కేబినేట్ ఆమోదం



హైదరాబాద్,డిసెంబర్14
**జనవాహిని**
రాయదుర్గం- ఎయిర్ పోర్ట్ మెట్రో ఉపయోగకరంగా ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. విమా నాశ్రయానికి మరో మార్గంలో మెట్రోనను ప్లాన్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ సర్కార్ 12,14 గంటలకు మించి కరెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. అన్ని అంశాలపై, అందరితో చర్చించి శ్వేతపత్రాలు విడుదల చేస్తామన్నారు. బిఎసీలో సమావేశాల ఎజెండాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అటు ఎంసిఆర్ హెచ్ఆర్డీలోని ఖాళీ స్థలాన్ని వినియోగించుకుంటామన్నారు. ప్రజాభవన్ లో కార్యాలయాన్ని ఉపయోగించు కుంటానని సిఎం తెలిపారు. కొత్తగా ఎలాంటి భవనాలు నిర్మించబోమని స్పష్టం చేశారు. కొత్తగా వాహనాలు కూడా కొనుగోలు చేయమన్నారు. శాసనసభ భవనాలను సమర్థంగా వినియోగించుకుంటామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తన నివాసం కోసం ఎంసిఆర్ హెచ్ఆర్డీలోని ఖాళీ స్థలాన్ని వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాభవన్ లో కార్యాలయాన్ని యధావిధిగా ఉపయోగించు కుంటానని సిఎం తెలిపారు. శాసనసభ భవనాలను సమర్థంగా వినియోగించుకుంటామన్నారు.

- మిగతా 2లో పేజిలో

## ఎన్ని సీట్లు మార్చినా.. ఫీట్లు చేసిన ఓటమి తప్పదు

- 151 మందిని మార్చినా వైసిపికి పరాజయం ఖాయం
-జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
-టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జోస్యం




# తెలంగాణకు కొత్త హైకోర్టు..

జనవరిలో శంకుస్థాపన!




హైదరాబాద్: **జనవాహిని**
తెలంగాణకు కొత్త హైకోర్టు భవనం ఏర్పాటు కానుందా?.. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారుల్ని ఆదేశించారు.రాజేంద్రనగర్‌లో వంద ఎకరాల్లో ఈ హైకోర్టును నిర్మాణం కాబోతున్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్ ఘటనపై ఉపా కింద కేసు నమోదు

- 8మంది భద్రతా సిబ్బందిపై వేటు
- ఘటన వెనక ఆరుగురు వ్యక్తుల ప్రమేయం
- ఐదుగురి అరెస్ట్..మరొకరి కోసం గాలింపు
- పార్లమెంట్ వద్ద భద్రత మరింతగా పెంపు

మిగతా 2లో



న్యూఢిల్లీ,డిసెంబర్14
**జనవాహిని**
పార్లమెంట్‌లో బుధవారం జరిగిన ఘటనపై అధికారులు చర్యలకు ఉపక్రమి ంచారు. లోక్‌సభ నడుస్తుండగా విజిటర్స్ గ్యాలరీ నుంచి ఓ యువకుడు సభలోకి దూకి యెల్లో కలర్ స్మోక్ వదిలాడు. అయితే అతన్నిఎంపీలు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారు. భద్రతా వైఫల్యానికి కారణమైన 8 మందిపై అధికారులు చర్యలు చేపట్టారు. వారిని సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో ప్రదీప్, రాంపాల్, అరవింద్, గణెళిశ్, నరేంద్ర, అనిల్, విమిత్,

# బాధ్యతలు స్వీకరించిన పలువురు మంత్రులు

(మొదటి పేజీ (తరువాయి)

పౌర సంబంధాల శాఖ కమిషనర్ కె. అశోక్ రెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జేడీలు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీ లు మధుసూధన్, హాష్మి, రాజా రెడ్డి, సీఐఈ రాధా కిషన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇకపోతే

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా శ్రీధర్ బాబు ఉదయం తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్ బాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, గండ్ర సత్యనారాయణ శ్రీధర్ బాబును కలిశారు. అలాగే మంథని నియోజకవర్గంతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శ్రీధర్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే పై ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దని మీడియాకు లికులు ఇవ్వకూడదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐటి కంపెనీలు హైదరాబాద్ నుండి తరలి వెళ్ళిపోతున్నాయని తప్పుడు ప్రచారాలు చేయొద్దన్నారు. సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెట్టకూడదని ఐటి సెక్రటరీని అధికారులను శ్రీధర్ బాబు హెచ్చరించారు. మరోమంత్రి సీతక్క కూడా తన ఛాంబర్‌లో ప్రవేశించారు. ప్రత్యేకంగా తనకు కేటాయించిన కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాఆ సబర్వాల్ సహా పంచాయితి రాజ్ శాఖ అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు.





# మెట్రో మార్గంలో మార్పులు

(మొదటి పేజీ (తరువాయి)

పాత అసెంబ్లీ బిల్డింగ్‌లో కౌన్సిల్ సమావేశాలు, ఇప్పుడు ఉన్న అసెంబ్లీలో శాసనసభ జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ఉండబోతోందని అన్నారు. ఎంసీహెచ్‌ఆర్డీలో ఉన్న కాళీ స్థలంలో తన క్యాంపు ఆఫీస్ నిర్మాణం చేస్తామన్నారు. ప్రజా భవన్‌లో ఇంకో బిల్డింగ్ ఉందని.. అది ఇంకో మంత్రికి ఇస్తామన్నారు. రాయదుర్గం నుంచి ఎయిర్పోర్ట్‌కు మెట్రో ఉపయోగకరంగా ఉండదని.. మరోరూట్‌లో మెట్రో ప్లాన్ చేస్తామని సీఎం తెలిపారు. శ్వేతపత్రాలు సహా అన్ని అంశాలపై అందరితో చర్చించి సమయం వచ్చినప్పుడు విడుదల చేస్తామని తెలిపారు. శాసనసభ సమావేశాల ఎజెండాపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇదిలావుంటే తెలంగాణ కేబినెట్ భేటీ ముగిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ఆమోదం లభించింది. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి ప్రసంగం కావడంతో ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనే దానిపై సుమారు గంటన్నరపాటు చర్చ జరిగింది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఎలాంటి పరిస్థితిలో ఉంది.. రానున్న రోజుల్లో ఎలా ఉండబోతోందనే అంశాలతో గవర్నర్ ప్రసంగం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని ప్రభుత్వం మొదలుపెట్టిన విషయం తెలిసిందే. మిగతా నాలుగు గ్యారంటీల అమలుపై మంత్రివర్గ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.

# పేదల బతుకులు మార్చాలనే తపన

శ్రీకాకుళం,డిసెంబర్14: పేదల బతుకులు మార్చాలనే తపన మీ బిడ్డకు మాత్రమే ఉందంటూ సీఎం జగన్ అన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేస్తామంటే ప్రతిపక్షాల నేతలు అడ్డుకుంటున్నారని సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీఎం విశాఖకు వచ్చి ఉంటానంటే చంద్రబాబు, ఆయన అనుంగు శిష్యులు ఏడుస్తున్నారు. నాన్ లోకల్స్ పక్క రాష్ట్రంలో ఉండి మన రాష్ట్రంలో ఏం చేయాలో నిర్ణయిస్తారు. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ జీవితంలో దీని వల్ల ప్రజలకు మంచి జరిగింది అని చెప్పుకోవడానికి ఏం లేదు. నేను ఇచ్చిన మాట కోసం ఎంతవరకైనా నిలబడతాని అంటూ వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.85 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే, ఉద్దానంలో రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు పేదల ప్రాణాలంటే లెక్కే లేదని విమర్శించారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పానికి నీరు కూడా అందించలేదని, అలాంటి వ్యక్తికి ఉత్తరాంధ్ర మీద ప్రేమ ఉంటుందా అని ప్రశ్నించారు. తాను మంచి చేశానని చెప్పుకోవడానికి చంద్రబాబు ఒక్క స్కీమ్ అయినా తెచ్చారా.? అంటూ నిలదీశారు. ఎన్నికలు వచ్చే సరికి ఎత్తులు, పొత్తులు, చిత్తుల మీదే చంద్రబాబు ఆధారపడతారు. తెలంగాణలో తన దత్తపుత్రుడిని బరిలో నిలిపారు. నాన్ లోకల్ ప్యాకేజీ స్టార్, బాబు ఇంకో పార్టనర్. తెలంగాణ ప్రచారంలో ఆంధ్రా పాలకులకు చుక్కలు చూపిస్తానని డైలాగులు కొడతారు. అక్కడ ఆంధ్రా ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడిన దత్తపుత్రుడికి కనీసం డిపాజిట్లు కూడా రాలేదు. కానీ, ఇండిపెంటెంట్ గా నిలబడిన బర్రెలక్క చెల్లెమ్మకు వచ్చిన ఓట్లు కూడా దత్తపుత్రుడికి రాలేదు. ఉత్తరాంధ్రకు చంద్రబాబు, పవన్ చేయని ద్రోహం లేదు.' అని జగన్ మండిపడ్డారు. దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ కు చంద్రబాబు ప్రయోజన వర్గం ఉంది తప్ప, ఆంధ్ర రాష్ట్రంపై ప్రేమే లేదని ప్రజలు ఇది గమనించాలని సూచించారు. ఉద్దానంలో ఇంత దారుణ పరిస్థితులున్నా, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిర్మించాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండి కూడా ఉత్తరాంధ్రకు చేయని ద్రోహం లేదని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, పోర్టు వస్తుందన్నా, మెడికల్ కాలేజీలు, రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నా చంద్రబాబు, పవన్ ఏడుస్తున్నారని దుయ్యబట్టారు. అందరితో కలిసి ఓ దొంగల ముఠాగా తయారై మన మీద పడి ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. 'అధికారం పోయినందుకు వీరి ఏడుపు, వారు ఏనాడూ ఇవ్వని విధంగా ఇంటింటికీ పెన్షన్ ఇస్తుంటే కూడా ఏడుపే, పింఛన్ పెంచినా ఏడుపే. సచివాలయ వ్యవస్థ తెచ్చి అందరికీ సేవలందిస్తున్నా ఏడుపే.' అంటూ జగన్ పేర్కొన్నారు.

# విభజనతో కొంత...జగన్‌తో మరింత

అమరావతి,డిసెంబర్14 విభజన వల్ల, జగన్ అరాచక పాలన వల్ల ఎంతో నష్టం జరిగిందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రకాశం జిల్లాలో గనులు తవ్వుకెళుతున్నారే తప్ప.. ప్రజలకు మంచి చేయడం లేదన్నారు. చిన్నప్పుడు ఫ్లోరోసిస్ కారణంగా తాము కనిగిరి నుంచి వెళ్లిపోయామని.. ఆ సమస్య ఇప్పటికీ ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మరోసారి ఏపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మంగళగిరిలో కార్యకర్తలతో సమావేశమైన ఆయన.. తెలుగుదేశం పొత్తులో మనం ప్రకాశం జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర కూడా వైసీపి విముక్త ప్రాంతంగా మారాలన్నారు. రూ.150 కోట్లు ఖర్చు పెట్టే సత్తా ఉన్న ఎమ్మెల్యేలు ప్రకాశం జిల్లాలో ఉన్నారని.. కానీ ప్రజలు మాత్రం పొట్ట చేత పట్టుకుని వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్ర రాష్ట్రంలో యువతకు అన్యాయం జరుగుతోందని.. మహిళాభివృద్ధిని కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పవన్ కళ్యాణ్ చెప్పారు. టీడీపీ, జనసేన పొత్తును నమ్మి గెలిపించాలని కోరారు. ఉద్దానం తరహాలో ప్రకాశం జిల్లాలో ఫ్లోరెసిస్, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పొత్తు దశాబ్ద కాలం ఉంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న సమస్యల్ని పరిష్కరించాలంటే.. కనీసం దశాబ్ద కాలం పడుతుందన్నారు. సినిమా టిక్కెట్ల కోసం ఛీఫ్ సెక్రటరీలు, రెవిన్యూ యంత్రాగాన్ని వాడే విధానానికి స్వస్తి పలుకుతామన్నారు. వాళ్లందరూ ప్రజల కోసం పని చేసి, మేలు చేసే మంచి పాలనని అందిస్తామని చెప్పారు. దశాబ్ద కాలంగా అనేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొని జనసేన ఇక్కడిదాకా వచ్చిందన్నారు. వైసీపీ వంటి గూండా నాయకులను ఎదుర్కొన్నామంటే.. యువత, మహిళలే తమకు బలమని ఉద్ఘాటించారు. మైనారిటీ అనే పదం తనకు ఇబ్బందిగా ఉంటుంది.. మైనారిటీ పేరుతో దూరం పెట్టడం కరెక్టు కాదనేది తన భావన అని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

# లాకప్ డెత్ పై విచారణ జరపండి..

– బాధ్యులుపై చర్యలు తీసుకోండి. డిజిపి కి బీఆర్ఎస్ నేతలు



నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన నేనావత్ సూర్య నాయక్ లాక్ అప్ డెత్ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ లు రాష్ట్ర డిజిపి రవి గుప్త ను కోరారు.గురువారం డిజిపి ని కలిసి సీనియర్ అధికారి చే పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# తెలంగాణకు కొత్త హైకోర్టు..

– జనవరిలో శంకుస్థాపన!

(మొదటి పేజీ (తరువాయి)

తెలంగాణ నూతన హైకోర్టు భవనం కోసం జనవరిలో శంకుస్థాపన జరపాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. గురువారం ఎంసీహెచ్‌ఆర్‌డీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, సీఎస్‌లు రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు.

ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో.. కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉందని సీజే అలోక్‌రాధే.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ క్రమంలో కొత్త హైకోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు సమాచారం.అయితే ఇప్పుడు హైకోర్టు భవనం హెరిటేజ్ భవనంగా పరిరక్షించాలని సీఎం రేవంత్ ఈ భేటీలో అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఉన్న భవనాన్ని సిటీ కోర్టుకు లేదంటే మరేదైనా కోర్టు భవనానికి వాడుకోవాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా కోర్టుల నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# ఎన్ని సీట్లు మార్చినా.. ఫీట్లు చేసిన ఓటమి తప్పదు

అమరావతి,డిసెంబర్14 ఎన్ని ఫీట్లు చేసినా, ఇప్పుడున్న మొత్తం 151 మందిని మార్చినా వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ గెలవరని టీడీపీ అధినేత చంద్రబాబు జోస్యం చెప్పారు. జగన్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మూడు నెలల తర్వాత మంగళగిరిలోని టీడీపీ ఆఫీసులో బాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ 11 మంది వైసీపీ ఇంచా ర్జులను మార్చడంపై బాబు స్పందిం చారు. తాడేపల్లి ప్యాలెస్‌లో ఓటమి భయం పట్టుకుం దని.. అందుకే 11 మంది ఇంచార్జు లను మార్చారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఒక నియోజకవర్గంలో చెల్లని కాసులు.. మరో చోట చెల్లుతాయా అని ప్రశ్నిం చారు. ప్రజలను వైసీపీ ఎమ్మెల్యేలు భయభ్రాంతులకు గురి చేశారని.. తిరుగుబాటు మొదలుకా వడంతో సీఎం జగన్ మార్పులకు తెరతీశారని చంద్రబాబు సెటైర్ వేశారు.జనాల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటంతోనే ఐదుగురు దళిత నేతలను బదిలీ చేశారని వ్యాఖ్యానించారు. బీసీలపై ప్రేమ ఉందని చెప్పుకునే వైసీపీ నాయకులు పులివెందుల సీటును వారికి ఇవ్వమని సీఎం జగన్‌ను అడిగే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. బలా బలాలను బట్టే పార్టీ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, కుప్పంలోనూ ప్రజాభిప్రాయం సేకరిస్తామని చెప్పారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని బట్టి నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. మిచౌంగ్ తుఫాను వల్ల రైతులకు చాలా నష్టం సంభవించిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ..15 జిల్లాల్లో 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. తుపాను హెచ్చరికలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. మిచౌంగ్ తుఫాను వల్ల రైతులకు చాలా నష్టం సంభవించిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 15 జిల్లాల్లో 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. తుపాను హెచ్చరికలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. హెచ్చరికను పరిగణనలోకి తీసుకుంటే పంట నష్టం, ప్రాణ నష్టం తగ్గించొచ్చన్నారు. పంట నష్టాన్ని నివారించే పరిస్థితులున్నా.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పట్టిసీమ నీటిని విడుదల చేసి ఉంటే పంట ముందుగానే చేతికి వచ్చేదన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో వచ్చే తుపానుల బారి నుంచి పంటలు కాపాడుకునేవాళ్లమన్నారు. తాను పట్టిసీమ కట్టానని జగన్ నీటిని విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వాన్ని తంతారని భయంతో విధిలేని పరిస్థితుల్లో పట్టిసీమ నుంచి నీటిని విడుదల చేశారని.. కానీ అప్పటికే ఆలస్యమైందన్నారు. పంటలు తుపాను బారిన పడ్డాయన్నారు. ప్రాజెక్టుల మెయిన్టెన్సును పట్టించుకోవడం లేదని.. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకెళ్లిందని తెలిపారు. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయన్నారు. గేట్ల రిపేర్లు చేయడం లేదని.. నిర్వాహణ కూడా అధ్వాన్నంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. రిపేర్లు చేయడానికి కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. పంట కాల్వల నిర్వహణ సరిగా చేయడం లేదన్నారు.

# రేపటి నుంచి ఆర్టీసీ బస్‌లో మహిళలకు జీరో టికెట్లు

– : ఆర్టీసీ ఎండీ సజ్జనర్

హైదరాబాద్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు సంస్థ అన్ని చర్యలు తీసుకుంటుందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు.

ఇందులో భాగంగా రేపటి (శుక్రవారం) నుంచి జీరో టికెట్లను జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ప్రయాణికురాలు విధిగా జీరో టికెట్ ను తీసుకుని సంస్థకు సహకరించాలని కోరారు.

మహిళలకు జీరో టికెట్ల జారీపై క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం సజ్జనర్ వర్చువల్ గా సమావేశాన్ని నిర్వహించారు. ' ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యానికి మహిళ నుంచి మంచి స్పందన వస్తోంది. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ప్రశాంతంగా పథకం అమలవుతోంది. పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు సాఫ్ట్‌వేర్‌ను సంస్థ అప్ డేట్ చేసిందని' వివరించారు.

సాఫ్ట్‌వేర్‌ను టిమ్ మెషిన్లలో ఇన్‌స్టాల్ చేస్తున్నామని, మెషిన్ల ద్వారా శుక్రవారం నుంచి జీరో టికెట్లను సంస్థ జారీ చేస్తుందన్నారు. మహిళా ప్రయాణికులు తమ వెంట ఆధార్, ఓటరు, తదితర గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలని సూచించారు. స్థానికత ధృవీకరణ కోసం వాటిని కండక్టర్లకు చూపించి విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని కోరారు.

# 222వ రోజుకు లోకేశ్ పాదయాత్ర



అనకాపల్లి,డిసెంబర్14 తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉత్సాహంగా సాగుతోంది. 222వ రోజు గురువారం ఉదయం యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం కొత్తూరు ఎస్వీ కన్వెన్షన్ క్యాంప్ సైట్ నుంచి యువనేత పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా లైను కొత్తూరులో రోడ్డు మార్గంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ మూడవరోజు సమ్మె చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు.

అయితే అంగన్‌వాడీల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఇదివరకే లోకేష్ ప్రకటించారు. కాగా యువనేత లోకేష్ పాదయాత్రకు అడుగడుగున ప్రజలు నీరాజనం పలుకున్నారు. నిన్నటి వరకు నడిచిన మొత్తం దూరం 3059.6 కి.మీ. కాగా లోకేష్ పాదయాత్రలో తెలుగుదేశం, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు కొత్తూరు సెంటర్‌లో సభ నిర్వహించనున్నారు. వివిధ వర్గాల వారిని కలుస్తూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ .. అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీల ఇస్తూ లోకేష్ ముందుకు సాగుతున్నారు.

# పార్లమెంట్ ఘటనపై ఉపా కింద కేసు నమోదు

(మొదటి పేజీ (తరువాయి)

వీరదాస్ ఉన్నారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ఉపా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దీని వెనక ఆరుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేయగా.. ఓ వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు వివరించారు.అరెస్టయిన వారిలోడీ మనోరంజన్, సాగర్, అమోల్ షిండే, నీలందేవి, విశాల్‌ను బుధవారం అదుపులోకి తీసుకోగా.. మరో నిందితుడు విశాల్‌ను గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు. మరో నిందితుడు లలిత్ కోసం గాలిస్తున్నారు. లోక్‌సభలో దాడికి పాల్పడిన వ్యక్తులకు బీజేపీ మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా కార్యాలయం నుంచి సందర్శకుల పాస్‌లు జారీ అయ్యాయి. దాడికి పక్కా ప్రణాళికతోనే సిద్ధమైనట్లు అధికారులు భావిస్తున్నారు. లోక్‌సభలో సందర్శకుల గ్యాలరీ నుంచి దూకిన డి.మనోరంజన్ మైసూరుకు చెందిన వాడని, తరచూ ఎంపీ ఆఫీసుకు వస్తుండేవాడని అధికార వర్గాలు తెలిపాయి. విజిటర్స్ పాస్ కోసం మనోరంజన్ మూడు నెలలుగా ఎంపీ ఆఫీసును సంప్రదిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అతనితో పాటు సభలో బెంచ్‌లపై నుంచి దూకుతూ స్పీకర్ చాంబర్ వైపు దూసుకెళ్లిన సాగర్ శర్మను మనోరంజన్ తన స్నేహితుడని చెప్పి, పాస్ తీసుకున్నట్లు గుర్తించారు. కొత్త పార్లమెంటును చూడాలని ఉందంటూ ఎంపీ కార్యాలయ అధికారులకు చెప్పి, వీరు పాస్‌లు తీసుకున్నారు.

బుధవారం సింహా తరపున మొత్తం మూడు పాస్‌లు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. మరో మహిళకు పాస్ ఇచ్చినప్పటికీ.. ఆమె తన కుమార్తెతో కలిసి రావడం, చిన్నారి పేరు పాస్‌లో లేకపోవడంతో అనుమతించ లేదని ఎంపీ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు దాడి ఘటన నేపథ్యంలో పార్లమెంటు ప్రాంగణం.. బయట అధికారులు భద్రతను పెంచారు. సందర్శకుల అనుమతిని ఇప్పటికే సభాపతి రద్దు చేశారు. పార్లమెంట్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని వ్యక్తులను భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్ పాసులు ఉన్న వారికి మాత్రమే పరిసర ప్రాంతాల్లోకి వెళ్లే అవకాశం పోలీసులు ఇస్తున్నారు. పార్లమెంట్ భవనానికి దారి తీసే మార్గాలన్నింట్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పార్లమెంటు భద్రత ఉల్లంఘన కేసులో ఏడో వ్యక్తి కోసం పోలీసుల గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. పరారీలో ఉన్న లలిత్ ఝా కోసం వెతుకుతున్నారు.

ఢిల్లీ స్పెషల్ సెల్‌కు చెందిన రెండు పోలీసు బృందాలు రాజస్థాన్ నీమ్రానా వద్ద లలిత్ ఝా ఆఖరి లొకేషన్‌గా గుర్తించారు. లలిత్ ఝా కోసం రెండు పోలిస్ బృందాలు రంగంలోకి దిగాయి. అట్టహాసంగా నిర్మించిన కొత్త పార్లమెంటు భవనం భద్రతను ప్రశ్నార్థకం చేసే సంచలన ఘటన బుధవారం చోటు చేసుకుంది.

లోక్‌సభలో జీరో అవర్ నడుస్తుండగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఇద్దరు యువకులు సందర్శకుల గ్యాలరీ నుంచి హఠాత్తుగా సభలోకి దూకారు. నినాదాలిస్తూ.. తమ వెంట తెచ్చుకున్న స్మోక్ క్యాన్లను తెరిచారు.

వాటిలోంచి పసుపు పచ్చని పొగ వెలువడి సభ లోపల వ్యాపించింది. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో ఎంపీలందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు.

# శ్రీకృష్ణ జన్మభూమి కేసులో కీలకమైన పరిణామం

ఆద్గాలో సర్వేకు అలహాబాద్ హైకోర్టు అనుమతి

అలహాబాద్,డిసెంబర్14 మధుర శ్రీకృష్ణ జన్మభూమి కేసులో అత్యంత కీలకమైన పరిణామం చోటు చేసుకుంది. మధురలోని షాహీ ఈద్గా కాంప్లెక్స్‌లో సర్వే నిర్వహించేందుకు అలహాబాద్ హైకోర్టు అనుమతి ఇచ్చింది. హిందూ పక్షం 'శ్రీ కృష్ణ విరాజ్‌మాన్' తరపున దాఖలైన పిటిషన్ పరిశీలించి కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం కీలకమైన ఆదేశాలను జారీ చేసింది.ముగ్గురు న్యాయవాదులను కమిషనర్లుగా నియమిస్తూ కోర్టు నిర్ణయించింది. వివాదాస్పద మసీద్ కాంప్లెక్స్‌లో సర్వే చేపట్టాలంటూ అలహాబాద్ హైకోర్టు సింగిల్ బెంచ్ జస్టిస్ మయాంక్ కుమార్ జైన్ ఆదేశాలు జారీ చేశారు. 'శ్రీ కృష్ణ విరాజ్‌మాన్' తరుపున దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి మధుర డిస్ట్రిక్ట్ కోర్టు నుంచి బదిలీ అయిన మొత్తం 18 పిటిషన్లను హైకోర్టు పరిశీలించింది. మధుర డిస్ట్రిక్ట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు అన్నింటినీ అందించాలని హైకోర్టు కోరింది. షాహీ ఈద్గా మజీద్ కాంప్లెక్స్‌లో అడ్వకేట్ కమిషనర్‌తో సర్వే చేయించాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు అనుమతించిందని హిందూ పక్షం తరపున వాదనలు వినిపించిన విష్ణు శంకర్ జైన్ చెప్పారు. సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులను ఈ నెల 18న ఖరారు చేయనున్నట్టు వెల్లడించారు. కాగా శ్రీకృష్ణుడి మందిరాన్ని కూలగొట్టి షాహి ఈద్గా మసీదు నిర్మించారన్న పిటిషనర్ల వాదనను అలహాబాద్ హైకోర్టు పరిశీలిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా.. తీర్పు రానుండడం చాలా మంచి విషయమని, సర్వే చాలా కీలకమవుతుందని అయోధ్యలోని శ్రీరామ్ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ గురువారం ఉదయం వ్యాఖ్యానించారు. సర్వేలో వాస్తవాలు బయటపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆయన మిడియాతో మాట్లాడారు.

# రాజకీయ జ్ఞానం లేకుండా మాట్లాడుతారా

కెటిఆర్‌పై మంత్రి పొన్నం ఆగ్రహం



కరీంనగర్,డిసెంబర్14 బిఆర్ఎస్ నేత, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు రాజకీయ జ్ఞానం లేదన్నారు. మీ హయాంలో ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధమా? సుధీర్ రెడ్డికి ఉన్న బుద్ధి కుడా నీకు లేదా. కడియంతో మీరే మాట్లాడించారా? ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారు. ప్రజలు మార్పు కోరుకున్నారు. మీ హయాంలో రెండు శాఖల లెక్కలే కళ్ళు తిరుగుతున్నాయి. కవితను జైలుకు పంపుతా అన్న బండి సంజయ్ పరిస్థితి ఏందీ? మమ్మల్ని జైలుకు ఎందుకు పంపలేదు హరీష్ రావు.. దమ్ములేదా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆటో డ్రైవర్ల సమస్య పై సమీక్ష చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు

హైదరాబాద్,డిసెంబర్14: ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బాధ్యతలు స్వీకరించాక అధికారులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఉదయం 9 గంటల సమయంలో తన ఛాంబర్‌లో శాస్త్రోక్తంగా తన సీట్లు కూర్చున్నారు. అనంతరం బాధ్యతలు తీసుకున్న ఫైల్‌పై సంతకాలు చేశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారులతో సమావేశమయ్యారు. తొలి సమావేశంలోనే అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు శ్రీధర్‌బాబు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసేలా లీకులు ఇస్తే మాత్రం సహించేది లేదని చెప్పేశారు. ఈ మధ్యకాలంలో ఓ కంపెనీ తెలంగాణ నుంచి వెళ్లిపోతోందని ప్రధాన మీడియాలో వార్తలు వచ్చాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం మొదలైపోయింది. దీంతో ప్రభుత్వం ఇలాంటి విషయంలో సీరియస్‌గా ఉండాలని చూస్తోంది. అందుకే ఇలాంటి లీకులు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు శ్రీధర్‌బాబు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసే పోస్టులు కానీ, తప్పుగా ప్రాజెక్టు చేసే వీలు అసలు ఇవ్వొద్దని అన్నారు. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తే మాత్రం ఉపేక్షించవద్దని చెప్పారట. కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. హైదరాబాద్‌లో తన ఎ÷-లాంట్‌ను స్థాపించేందుకు ఆసక్తి చూపిన కార్నింగ్ సంస్థ చెన్నైకు తరలిపోతుందనే వార్త సోషల్ మిడియాలో తెగ వైరల్ అయింది. దీంతో కాంగ్రెస్ వ్యతిరేకంగా పని చేసే వాళ్లంతా రెచ్చిపోయి పోస్టులు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చిన భారీ మార్పు అంటూ సోషల్ మిడియాలో సెటైర్లు పేల్చారు. దీనిపై ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు కానీ ఇప్పుడు బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌బాబు మాత్రం అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. జయేశ్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.

# మినీ అంగన్‌వాడీలకు ప్రమోషన్

హైదరాబాద్,డిసెంబర్14: తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ధనసరి అనసూయ అలియాస్ సీతక్క బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో వేదమంత్రోచ్ఛరణాల మధ్య ఆమె మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి ఫైల్ మీద సంతకం
పెట్టారు. ఈ మేరకు ఆమె అంగన్వాడీలకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటివరకు మినీ అంగన్వాడీలుగా ఉన్న కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ రూపొందించిన ÷లుపై మంత్రి సీతక్క తొలి సంతకం చేశారు.

# 14మంది ఎంపిలపై సస్పెన్షన్ వేటు

## శీతాకాల సమావేశాలు ముగిసే వరకు అమలు

న్యూఢిల్లీ,డిసెంబర్14పార్లమెంట్‌లో 14 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. అనుచితంగా ప్రవర్తించినందుకు గాను వీరిని శీతాకాల సమావేశాలు పూర్తయ్యేదాకా సభ నుంచి సస్పెండ్ చేశారు. తొలుత ఐదుగురిని సస్పెండ్ చేయగా.. ఆ తర్వాత మరో 9 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం జరిగింది. వీరిలో కాంగ్రెస్ నుంచి 9 మంది, సీపీఎం నుంచి ఇద్దరు, డీఎంకే నుంచి ఇద్దరు సీపీఐ నుంచి ఒకరు ఉన్నారు. సభాపతి ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘించారనే కారణంగానే వీరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. మొదట ప్రతాపన్, హిబీ ఈడన్, జోతి మణి, రమ్యా హరిదాస్, డీన్ కురియాకోస్ సస్పన్షన్‌కు గురయ్యారు. ఈ ఐదుగురు సభాపతి ఆదేశాలను ఉల్లంఘిస్తూ ప్రవర్తించిన తీరును తీవ్రంగా పరిగణిస్తూ ఈ తీర్మానం ప్రవేశపెడుతున్నామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లద్ జోషీ పేర్కొన్నారు. ఈ తీర్మానం ఆమోదం పొందాక సభను 3 గంటలకు వాయిదా వేయడం జరిగింది. సభ ప్రారంభం అవ్వగా.. విపక్ష సభ్యులు మళ్లీ ఆందోళనకు దిగారు. దీంతో.. బెన్నీ బెహనన్, వీకే శ్రీకందన్, మహమ్మద్ జావెద్, పీఆర్ నటరాజన్, కనిమొళి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ పార్థిబన్, ఎస్ వెంకటేశన్, మాణికం ఠాగూర్‌ను సస్పెండ్ చేస్తూ..

ప్రహ్లద్ జోషీ మరోసారి తీర్మానం ప్రవేశపెట్టగా, దీనికి సభ ఆమోదం తెలిపింది.

లోక్‌సభలో భద్రతపై స్పీకర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సూచనలు అడిగారని.. ఈ అంశంపై రాజకీయాలు చేయొద్దని ప్రతిపక్షాలకు సభలో హితవు పలికారు. కానీ.. ప్రతిపక్షాలు మాత్రం పార్లమెంట్ భద్రతా లోపంలో ఆందనళనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ అంశంపై అమిత్ షా మాట్లాడాలని.. దీనికి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తద్వారా సభలో గందరగోళం నెలకొనడంతో సభను స్పీకర్ రేపటికి వాయదా వేశారు. అటు.. రాజ్యసభలోనూ తృణమూల్ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఓబ్రియన్ సైతం సస్పెండ్ అయ్యారు. లోక్‌సభలో చోటు చేసుకొన్న భద్రతా లోపంపై చర్చించాలని ఆయన పట్టుబడటంతో సస్పెండ్ చేశారు.అయితే.. ఓబ్రియన్‌ను రాజ్యసభ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఎంపీ డోలాసేన్ తప్పుబట్టారు. పార్లమెంట్ భద్రతా లోపం అనేది దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారమని.. ఈ అంశాన్ని లేవనెత్తడం ప్రతిపక్షంగా తమ కర్తవ్యమని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తమకు ఈ అంశాన్ని లేవనెత్తడం హక్కుందని.. కాబట్టి తాము వెల్ వద్దకు వెళ్లి నినాదాలు చేశామని చెప్పారు. తమని సస్పెండ్ చేసినా సిద్ధమేనని పేర్కొన్నారు.

# ఏపీలో దొంగ ఓట్ల వ్యవహారంపై బీజేపీ సీరియస్

## - ఇసిని కలిసి ఫిర్యాదు చేసిన పురంధేశ్వరి
## -కఠిన చర్యలు తీసుకోవాలని వినతి



న్యూఢిల్లీ,డిసెంబర్14): ఏపీలో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏపీలో దొంగ ఓట్ల వ్యవహారంపై బీజేపీ సీరియస్ అయ్యింది. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌ను బీజేపీ నేతలు పురంధేశ్వరి, సుజనా చౌదరి కలిసి నకిలీ ఓట్ల నమోదు, ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు చేశారు. ఏపీలో నకిలీ ఓట్ల నమోదు, టీడీపీ ఓట్ల తొలగింపుపై ఈసీకి టీడీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి మిడియాతో మాట్లాడారు. కొంతకాలంగా ఏపీలో ఓటర్ లిస్ట్ టాంపరింగ్ జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో సీఈసీని కలిశామని.. తిరుపతి ఉప ఎన్నికల్లో ఓటర్ ఐడీ కార్డులు 35 వేలు డూప్లికేట్ చేసిన వాటికి సంబంధించిన రుజువులను ఎన్నికల సంఘానికి ఇచ్చామని పురంధేశ్వరి వెల్లడించారు. తిరుపతి ఉపఎన్నికల్లో దాదాపు 35 వేల మంది నకిలీ ఓట్లు వేశారని.. అలాగే విశాఖలో భౌతికంగా లేనివారికి సంబంధించి 61వేల ఓట్లు చేర్చారని ఆమె ఆరోపించారు. విశాఖపట్నం నార్త్‌లో ఇంటింటి సర్వే చేయగా 2 లక్షల 70 వేల మంది ఓటర్లు ఉంటే అదనంగా మరో 61 వేల మంది ఓట్లు యాడ్ చేశారన్నారు. దొంగ ఓట్లకు సంబంధించిన వాటికి రుజువు ఇచ్చామని.. కేంద్ర ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఈ అంశంపై త్వరగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. వాలంటీర్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పురంధేశ్వరి ఆరోపించారు.

మరోవైపు ఇటీవల తుఫాన్ కారణంగా రైతులు పంట నష్టపోయారని పురంధేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట నష్టం నిమిత్తం హెక్టారుకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటే రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలనే విధానం ప్రభుత్వం వద్ద ఉందా అని ప్రశ్నించారు. 22 మంది వైసీపీ ఎంపీలు ఢిల్లీలో ఏం చేస్తున్నారో.. ఏం పైరవీలు చేస్తున్నారో అంటూ అసహనం వ్యక్తం చేశారు. మిచౌంగ్ తుపానును జాతీయవిపత్తుగా ప్రకటించాలని కోరామని.. బాధిత రైతులను సీఎం జగన్ కార్పెట్ వేసుకుని పరామర్శిస్తారా అని ఎద్దేవా చేశారు. ఆలుగడ్డకు.. ఉల్లిగడ్డకు తేడా తెలియని మనిషి సీఎం జగన్ అని పురంధేశ్వరి అన్నారు. డిమాండ్ల కోసం పోరాడుతున్న అంగన్వాడీలను అణచివేయడం దారుణమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఓ రోజు వస్తుంది.. ఆరోజు వాళ్లంటే ఏంటో చూపిస్తారని అభిప్రాయపడ్డారు. ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపమే.. ఏపీ ప్రజల ఇబ్బందులకు కారణమన్నారు. ఏపీలో మార్పు మొదలైందని.. జగన్ సర్కార్‌కు శాపనార్థాలు పెడుతున్నారని పురంధేశ్వరి స్పష్టం చేశారు.

మరోవైపు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టీడీపీ ఎంపీలు కూడా కలిశారు. సీఈసీని కలిసిన వారిలో ఎంపీలు కనకమేడల, గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు ఉన్నారు.

# దొంగ ఓట్లను చేర్పించిన టిడిపి

## ఇతర రాష్ట్రాల్లోని వారి పేర్లు నమోదు
## ఎన్నికల సంఘానికి వైసిపి ఎంపిల ఫిర్యాదు

న్యూఢిల్లీ,డిసెంబర్14 ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని వైసీపీ ఎంపీలు కలిశారు. ఎంపీ విజయసాయి రెడ్డి నేతృత్వంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని వైసీపీ ఎంపీలు కలిశారు. ఏపీలో టీడీపీ దొంగ ఓటర్లను చేర్పించిందని ఎంపీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు ఏపీలో 40,76,580 దొంగ ఓట్లు ఓటర్ జాబితాలో చేర్పించారని ఫిర్యాదు చేశారు. ఒకే ఫోటోతో ఇంటి పేరు మార్చి పలు ప్రాంతాలలో ఓటరులుగా టీడీపీ సానుభూతిపరుల పేర్లు నమోదయ్యాయని ఎంపీలు ఆరోపించారు. హైదరాబాద్ , కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలలో నివసిస్తున్న టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఏపీలో కూడా టీడీపీ నేతలు నమోదు చేయించినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి దొంగ ఓటర్లను తొలగిస్తున్న బూత్ లెవల్ అధికారులపై టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారని ఎంపీలు మండిపడ్డారు. వైఎస్ఆర్సీపీ సానుభూతిపరుల ఓటర్లు తొలగించేందుకు ఫారం -7 దరఖాస్తులు బీఎల్వోలకు టీడీపీ నేతలు సమర్పిస్తున్నారని తెలిపారు. విచారణ సమయంలో నిజాలు వెలుగు చూస్తుండడంతో బీఎల్ఓలను టీడీపీ బ్లాక్ మెయిల్ చేస్తోందని వైసీపీ ఎంపీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ 'మై పార్టీ డాష్ బోర్డ్' యాప్ ద్వారా ప్రజల కుల, మత, వ్యక్తిగత వివరాలు సేకరిస్తోందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం అనే విషయాన్ని ఈసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చామన్నారు. ఈ డాటాను అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని సర్వర్ లో
భద్రపరుస్తున్నారని.. సేవా మిత్ర పేరుతో గతంలో ఇలాగే డేటా సేకరించారు. వారిపై కేసులు కూడా నమోదు చేశామని గుర్తు చేశారు. ఒక వ్యక్తి కులాన్ని తెలుసుకోవడం ద్వారా పోలరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని.. మోడల్ కోడ్ ఉల్లంఘించేలా అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని విమర్శఇంచారు. ఓటర్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి 30 ఇళ్లకు ఒక టీడీపీ కార్యకర్తను నియమిస్తున్నారని.. ఆ కార్యకర్త మానిఫెస్టో రూపొందించే కసరత్తు ఆ 30 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించి లండన్ సర్వర్ లో భద్రపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారిగా లేక ఎన్నికల కమిషన్ అధికారిగా ప్రజలను మభ్యపెడుతూ వివరాలు సేకరిస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఇలా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి తమ ఓటర్లు కాదు అనుకుంటే వారి ఓట్లు తొలగించేలా తప్పుడు దరఖాస్తులు చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ పేరుతో ఆ కుటుంబాలకు హామీ కార్డులు ఇస్తున్నారని.. అలాగే దొంగ ఓట్లు కూడా చేర్చుతున్నారు

ఒక పేరులో స్పెల్లింగ్ కాస్త మార్చి మరలా మరలా పేర్లు నమోదు చేస్తున్నారని విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే తెలంగాణలో నివసిస్తున్న వారి పేర్లను కూడా ఇక్కడ చేర్చుతున్నారు. తెలంగాణ ఓటర్స్ ఏపీలో ఓటు వేయించేలా ఒక డ్రైవ్ నిర్వహించే ప్రయత్నం టీడీపీ ప్రయత్నిస్తోందని తెలిపారు. టీడీపీ స్టేట్ కోఆర్డినేటర్ సురేష్ కోనేరు పేరిట ఒక ఫిర్యాదు చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ కి ఫి చేశారని.. ఒక 10 లక్షల ఓటర్లు నకిలీ ఓటర్లు అంటూ పేర్కొన్నారు. దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు వెర్గి÷ చేసి 1-2? తేడాలు మినహా అంతా కరెక్ట్ అని తేల్చారన్నారు. టీడీపీ ఎన్నికల సంఘం అధికారుల సమయాన్ని వృధా చేసేలా తప్పుడు ఫిర్యాదులు ఇస్తున్నారని ఆరోపించారు. బూత్ లెవెల్ ఏజెంట్ మాత్రమే ఫిర్యాదు చేసేలా ఉండాలి. సురేష్ కోనేరు వంటి వ్యక్తులు ఇచ్చే బల్క్ ఫిర్యాదులపై సమయం వృధా చేసుకోవద్దని విజయసాయిరెడ్డి సూచించారు. ఓకే ఐడీతో రెండు మూడు ఓట్లు నమోదు అయ్యాయి. ఆధార్ సీడింగ్ చేస్తే ఎలాంటి దొంగ ఓట్లు తొలగించవచ్చు. ఇదే విషయాన్ని మేము ఈసీ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు.

# జడ్పీ చైర్‌పర్సన్‌గా కోవ లక్ష్మి రాజీనామా

- ఎమ్మెల్యేగా గెలవడంతో నిర్ణయం

ఆసిఫాబాద్,డిసెంబర్14 కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాపరిషద్ చైర్‌పర్సన్ పదవికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి రాజీనామా చేశారు. దీంతో ఆమె స్థానంలో జడ్పీ చైర్మన్‌గా కోనేరు కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995లో తిర్యాణి మండలం పండిగి మాదర ఎంపీటీసీ స్థానానికి మొదటిసారి నిలబడి
గెలిచింది. 2001లో పండిగి మాదర నుంచి మరోసారి ఎంపీటీసీగా గెలిపొందింది. 2002లో తిర్యాణి మండల ఎంపీపీగా సేవలు అందించారు. అనంతరం ఆసిఫాబాద్ పట్టణ సర్పంచ్‌గా 2006లో గెలుపొందారు. మరోసారి 2013లోనూ ఆసిఫాబాద్ సర్పంచ్‌గా గెలిపొందారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 2014లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఏడాది పాటు తెలంగాణ ప్రభుత్వ పార్లమెంటరీ కార్యదర్శి పని చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 171 ఓట్లతో ఓటమిని చవి చూశారు. 23 యేండ్లపాటు ఓటమి లేకుండా ఏ ఎన్నికలు వచ్చినా విజయమే ఆమె సొంతం అయ్యింది. మొదటి సారి ఓటమి కావడంతో నిరాశలో ఉండగా, కేసీఆర్ స్వయంగా జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రకటించారు. 2019 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం కుమ్రంభీం జిల్లాకు జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రాతినిథ్యం వహిస్తున్న క్రమంలో ముడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 22,810 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌పై గెలుపొందారు.

# రుషికొండలో అక్రమాలపై పిటిషన్

అమరావతి,డిసెంబర్14 రుషికొండలో అక్రమాలపై హైకోర్ట్‌లో అనుబంధ పిటిషన్ దాఖలైంది. పరిశీలనకు వచ్చిన కమిటీకి అక్రమాలపై పిటిషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విశాఖ జన సేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తరపున పిటిషన్ దాఖలైంది. కమిటీ పర్యటన పూర్తయిందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి చెప్పారు. వెంటనే మూర్తి యాదవ్ ఇచ్చిన నివేదికను కమిటీకి పంపాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. రుషికొండలో తవ్విన డెబ్రిస్‌ను సముద్రంలో వేయడం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఆర్‌జెడ్ పరిధిలో భూగర్భ జలాలు వినియోగం కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని మూర్తి యాదవ్ పేర్కొన్నారు. అక్రమాలు అన్నింటినీ మూర్తి యాదవ్ సాక్ష్యాధారాలతో సహా కోర్టుకు సమర్పించారు. ఈ నివేదికను వెంటనే కమిటీకి పంపాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# రైతాంగం నష్టపోయినా పట్టించుకోరా


## - సిఎం జగన్ తీరుపై రామకృష్ణ ఆగ్రహం



విజయవాడ,డిసెంబర్14: రాష్ట్రంలో తుఫాన్ వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయిందని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఇంత జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.

గువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మొత్తం 440 మండలాల్లో కరవు ఉంటే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తుఫాన్ వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీసం బాధ్యత ఉందా అని నేను ప్రశ్నిస్తున్నా.. అంటూ ఆయన మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అందరి తలపై చేయి వేసి తిరిగావు.. ఇప్పుడు పొలాల్లో దిగకుండా షో చేస్తున్నావు.. అని ఆయన అన్నారు. ఓట్లు కోసం ఎత్తులు వేశావు... అన్నివర్గాల ప్రజలను, రైతులను చిత్తు చేశావని, కరవు, తుఫాన్ ప్రాంత రైతుల పిల్లలకు ఫీజు మాఫీ చేయాలి ఆయన డిమాండ్ చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, మంత్రులు క్షేత్ర స్థాయిలో పంట నష్టం పరిశీలించాలని, కేంద్ర బృందాలను కలిసి నష్టం వివరాలను అందచేస్తామని, ఢిల్లీ స్థాయిలో అందరినీ కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని రామకృష్ణ అన్నారు.

# స్పీకర్ గడ్డంకు గుత్తా అభినందనలు



హైదరాబాద్,డిసెంబర్14 శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి నరసింహా చార్యులతో కలిసి స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన ఆయన పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావుతో పాటు అన్ని పార్టీలకు చెందిన సభ్యులు స్పీకర్‌గా నియామకమైన గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రసాద్‌తో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్పీకర్ ఎన్నికకు సహకరించిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.

# వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టుకు శ్రీకారం

శ్రీకాకుళం,డిసెంబర్14): శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం మఖరాంపురం జాతీయ రహదారి పక్కన రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజల ధార సురక్షిత తాగునీటి ప్రాజెక్టుని సిఎం జగన్మోహన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. తొలుత శిలాఫలకం ఆవిష్కరణ చేసి పంపు హౌస్‌లో బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్దానం ప్రాంతంలో కళ్లెదుటే కిడ్నీ సమస్య కనిపిస్తున్నా గతంలో ఏ ప్రభుత్వాలు చొరవచూపలేదని చెప్పుకొచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.785 కోట్లతో ఉద్దానం వ్యాధిగ్రస్తుల సమవస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించామని సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు.

# నంద్యాలలో బిజెపి అసెంబ్లీ కార్యాలయం ప్రారంభం

## – నంద్యాల బిజెపి అసెంబ్లీ అభ్యర్థిగా అభిరుచి మదు.
## – బిజెపి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల డిసెంబర్ 14. జనవాహిణి న్యూస్.స్థానిక నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ ఆసుపత్రి ఎదుట నంద్యాల అసెంబ్లీ స్థాయి భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయం ను, నంద్యాల అసెంబ్లీ బిజెపి కన్వీనర్ అభిరుచి మదు, నంద్యాల జిల్లా ఇంఛార్జి రమేష్ నాయుడు,జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి రిబ్బన్ కట్ చేసి కార్యకర్తల చప్పట్ల మధ్య ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షురాలు రాకతో ఊరేగింపు గా పార్టీ కార్యాలయం వరకు డప్పులు,తప్పెట్లు, పూల వర్షంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చాక అభివృధి శూన్యమని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ఈతకాయలు ఇచ్చి తాటికాయలు లాగేసుకున్న చందంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో రైతులు, యువత, మహిళలు, బిసి,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు న్యాయం చేయలేని ప్రభుత్వం అని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని యువతకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 10 వేల మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు అని విమర్శించారు. యువత ఇంజనీరింగ్,మెడిసిన్ చదివి ఉద్యోగాలు లేక ఇబ్బందులు ఎదురుకుంటున్న రని అన్నారు. పరిశ్రమలు తీసుకొని రారు, ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్ళడం వల్ల ఉపాధి లేక వలసపోతున్నారు అన్నారు. జిల్లాల్లో ఆరు మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తించారని, మండలాల్లో వున్న ప్రజలు కుటుంబ పోషణకు పక్క రాష్ట్రాలకు వలసపోతున్నారు అని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అవగాహన లేదన్నారు.

చదువు లేకపోయినా డబ్బు వున్నవారికి ఎంపి,ఎమ్మెల్యే,మినిస్టర్ ,సలహాదారులు వైసిపి పార్టీ లో వున్నారని పేర్కొన్నారు. వరదల్లో ప్రజలు పండించిన పంట నష్టపోతే, వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి దూరం నుంచే చేతులు ఊపుతూ,ఆసుపత్రిలో బాధితులతో నగుతు,సిగ్గు పడుతూ పరామర్శించడం సిగ్గుచేటన్నారు. ఉల్లిగడ్డ కు వుర్లగడ్డ కు తేడా తెలియని ఏకైక ముఖ్యమంత్రిని రాష్ట్ర ప్రజలు చూశారని అన్నారు. నంద్యాలలో నేతలు 100 కోట్లు పెట్టీ గెలిచి, 200 కోట్లు తినడం తప్పా ప్రజల కు చేసింది ఏమిలేదన్నారు. ప్రజలకు మంచిచేయలని నేతలకు లేదన్నారు. ప్రజలు బిజెపితో అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో బిజెపి బలోపేతానికి కృషి చేస్తుందని అన్నారు. జిల్లాలో బిజెపి లో యువరక్తం వురకలేస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బూత్ కమిటీలు,మోర్చా కమిటీలు వేస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు.



వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లీ బరిలో బిజెపి అభ్యర్థులు నిలబడతారు అన్నారు. 37 మండలాల్లో బూత్, మొర్చా కమిటీలు పూర్తి అయ్యాయని అన్నారు. ఒకొక్క బూత్ కమిటీలో 11 మంది సభ్యులను ఏర్పాటుచేసి పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని అన్నారు. నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గం కార్యాలయం ఏర్పాటు చేశామని అన్నారు.
నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ గా పార్టీ నియమించింది అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి గా పోటీలో ఉన్నానని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బూత్ కమిటీలను బలోపేతం చేసేందుకు ప్రణాళిక రూపొందించామని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం పై పోరాటాలు,కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజల్లోకి తీసుకొని వెళతానని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కశెట్టీ కృష్ణ మూర్తి,చంద్రశేఖర్, మేడా మురళీధర్,డాక్టర్ ఇంటి ఆదినారాయణ,తూము శివారెడ్డి, నిమ్మకాయల సుధాకర్, బ్రహ్మం,ముక్తియర్ బాషా,రాధాకృష్ణ, లక్ష్మి కాంతారెడ్డి,ఉపేంద్ర నాధ రెడ్డి,రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీ లక్ష్మి,స్వాతి,చెన్నమ్మ, శ్రీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ వర్కర్స్ ,హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 3వ రోజు నిరవధిక సమ్మె..



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 14. జనవాహిణి న్యూస్.
నంద్యాల పట్టణంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 3వ రోజు నిరవధిక సమ్మెకు నంద్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా భూమా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయలన్నారు, వారు పనిచేసిన కాలానికి ఇప్పటి వరకు జీతం కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీ వర్కర్స్ కి టీడీపీ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి జెవి.మనోహర్ రెడ్డి, నంద్యాల, గోస్పాడు కన్వీనర్లు మండల కన్వీనర్లు గురునాధ్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, రాజశేఖర్, సునీల్, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ..!

మహానంది. డిసెంబర్ 14. జనవాహిణి న్యూస్.
మహానంది క్షేత్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్/డి టి డబ్ల్యూ ఓ.శివ ప్రసాద్ గురువారం తనికి చేశారు. ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతోపాటు విద్యార్థులు త్వరలో జరగబోయే సంవత్సరిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం దాదాపు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రధానోపాధ్యాయునితోపాటు ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ చేశారు. అందరూ సంయుక్తంగా ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు.

## డిసెంబర్ 16న గిరిజన మంత్రి,ఎమ్మెల్యే లకు ఆత్మీయ సత్కారం

### గిరిజన సోదరులు, మేధావులు,



(సిద్దిపేట జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాల భానుబాబు )విద్యార్థి,యువకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయండి.గుగులోతు వీరన్న నాయక్,కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ఈ నెల 16 వ తేదీన హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో గిరిజన మంత్రి సితక్కతో పాటు 12 మంది గిరిజన ఎమ్మెల్యేలకు గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుగులోతు వీరన్న నాయక్ పత్రిక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విశిష్ట అతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గిరిజన మంత్రి సీతక్క, గిరిజన ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆత్మీయ సత్కార కార్యక్రమంలో భాగంగా గిరిజన తెగలతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమానికి రాష్ట్రంలో 33 తెగలుగా ఉన్న గిరిజనులు, గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇంధన పొదుపు వారోత్సవాలు భాగంగా గోడపత్రిక మరియు కరపత్రిక ను జాయింట్ కలెక్టర్,డిఆర్ఓ అధ్వర్యంలో విడుదల



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 14. జనవాహిణి న్యూస్.జాయింట్ కలెక్టర్ గారి ఛాంబర్ లో " ఇంధన పరిరక్షణ–చిట్కాలు" అను కరపత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గారు,డిఆర్ఓ బి.పుల్లయ్య గారు,ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవివి.రమణారెడ్డి గారు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఆంథోని రాజు గారు,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి.రవికుమార్ గారు,జి.రామయ్య గారు విడుదల చేశారు. సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్క వినియోగదారుడు విద్యుత్ ను ఎంత పొదుపుగా వాడితే భవిష్యత్తులో ఇందన ఏమైనా పొదుపు చేసినవారమై ముందు తరాల వారికి ఎంతగానో లాభం చేకూర్చిన వారం అవుతామని విద్యుత్ పొదుపు–సామాజిక బాధ్యత అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఇంధన శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఈ కరపత్రికను విడుదల చేసినారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ నంద్యాల జిల్లా వారు జిల్లా జాయింట్ కలెక్టర్ వారిచే ఈ పత్రికను విడుదల చేయించి జిల్లా ప్రజలకు ఇంధన పొదుపుపై సలహాలు చిట్కాలు పాటించవలసిన కోరియున్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-14 క్రికెట్ పోటీలు

### – విజేత పెద్దపల్లి జిల్లా జట్టు
### – ట్రోఫీలు అందించిన జేఎన్టీయూ ప్రిన్సిపాల్



పెద్దపల్లి రామగిరి (జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ రమేష్)
ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్–14 క్రికెట్ పోటీలు సెంటినరీ కాలనీ జేఎన్టీయూ కళాశాల స్టేడియంలో గురువారం జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జీ.ఎఫ్) పెద్దపెల్లి జిల్లా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. మొదట పోటీలో పెద్దపల్లి జిల్లా జట్టు, కరీంనగర్ జట్టు పైగెలుపొందింది.కరీంనగర్ జట్టు 10 ఓవర్లలో 82 పరుగులు చేయగా, పెద్దపల్లి జట్టు 9 ఓవర్లలో 83 పరుగులు చేసింది. రెండో పోటీలో జగిత్యాల జట్టుపై, సిరిసిల్ల జట్టు గెలుపొందింది. సిరిసిల్ల జట్టు 80 పరుగులు చేయగా, జగిత్యాల జట్టు 31 పరుగులు మాత్రమే చేసింది. ఫైనల్ లో పెద్ద పల్లి, సిరిసిల్ల జట్లు పోటీపడ్డాయి. పెద్దపల్లి జట్టు సిరిసిల్ల జట్టు పై గెలుపొందింది. ఈ పోటీలలో పెద్దపల్లి జిల్లా జట్టు 8 ఓవర్లలో 64/2,సిరిసిల్ల జట్టు 10 ఓవర్ లో 63/6 పరుగులు సాధించారు. పెద్దపల్లి కెప్టెన్ పల్లె సాక్షిత్ రావుకు, సిరిసిల్ల జట్టు కెప్టెన్ డి.చరణ్ తేజా కు, జట్టులోని క్రీడాకారులకు స్థానిక జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చెరుకు శ్రీధర్ రెడ్డి షీల్డ్ లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. ఓడిన ప్రతి ఒక్కరూ తదుపరి గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి మరిన్ని బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ, పీఈటి లు కొమురోజు శ్రీనివాస్, సోమశేఖర్,జావిద్, విజయ్ (పెద్దపల్లి), అప్సర్ (జగిత్యాల), డేవిడ్, అజయ్ (సిరిసిల్ల), కొము రోజు కృష్ణ, ఏ.శ్రీనివాస్ (కరీంనగర్), జేఎన్టీయూ కళాశాల పీడీ పింగిలి కృష్ణారెడ్డి, బుద్దుల తిరుపతి(సెంటినరీ కాలనీ) పాల్గొన్నారు.

## కోహెడ లో ఆధార్ పర్మనెంట్ సేవలు మున్నాళ్ల ముచ్చటేనా?



(సిద్దిపేటజనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాలబాబు )
కొత్త ఆధార్ కార్డులకు ఆధార్ అనుసంధానంకు కోహెడ లో ఆధార్ సెంటర్ ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యధోరనితో పనిచేయక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వందలో అయిపోయే ఆధార్ కు వేల రూ"లు వెచ్చిస్తున్న పరిస్థితి నెలకొంది! కోహెడలో ఆధార్ సెంటర్ రెగ్యులర్ గా నడిచేవిధంగా సంబంధిత అధికారులు చొరవ చూపాలని బిజెపి మండల అధ్యక్షుడు కోహెడ ఎంపిటిసి ఖమ్మం వేంకటేశం–స్వరూప డిమాండ్ చేశారు! ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ కోహెడకు వచ్చిన పర్మినెంట్ ఆధార్ సెంటర్ ఎక్కడుందని ఈ మధ్యన ప్రశ్నించగానే జిల్లా మీసేవ అధికారులు హడావుడిగా వచ్చి ప్రారంభించి వారం తిరగకముందే మళ్ళీ అధికారుల అలసత్వంతో ఆధార్ సెంటర్ సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని కోహెడ అంటే సిద్దిపేట జిల్లా అధికారులకు ఎందుకు చిన్నచూపో అర్థంకావడం లేదని ప్రతిదానికీ ఆధార్ అనుసంధానం చేయడం మూలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పిల్లల ఆధార్ అనుసంధానం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఎక్కువగా వెచ్చించి ఇబ్బందులు పడుతున్నారని ప్రజాలవసరాల రీత్యా కోహెడలో రెగ్యులర్ గా నడిచే ఆధార్ సెంటర్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని సంబంధిత అధికారులను కోరారుఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బండ జగన్ యాదవ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, బిజెపి మండల ప్రధానకార్యదర్శులు పిల్లి నర్సయ్య గౌడ్, జాలిగం రమేష్, బిజెవైఎం మండల అధ్యక్షుడు కంది సత్యనారాయణ రెడ్డి, తదితరులున్నారుబి

## ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

: సేవా అధ్యక్షురాలు శ్రీమతి అలివేణి సుధాకర రావు
పెద్దపల్లి: రామగిరిబీ(జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ రమేష్)సింగరేణి సేవా సమితి ద్వారా అందిస్తున్న పలు వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని ఆర్జీ–3 సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఎన్. అలివేణి సుధాకర రావు అన్నారు.గురువారం స్థానిక సెంటినరీ కాలనీలోని సేవా భవనము నందు టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటిషియన్ మొదలగు విభాగాలలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఎన్. అలివేణి సుధాకర రావు, ఏపీఏ జిఎం సతీమణి శ్రీమతి కె.విజయలక్ష్మి వెంకటేశ్వర్లు లు ప్రారంభించారు.
తదనంతరం 2000 సంవత్సరం డిసెంబర్ 10న ఏర్పాటు చేయబడిన సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా సభ్యులందరూ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ సింగరేణి సేవా సమితి ద్వారా అందిస్తున్న పలు ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని,

ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయ కర్త బి. రాయమల్లు, కే.సుధాకర్ లతోపాటు సేవా సభ్యులు, శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## పేద పిల్లల భవిష్యత్తుపై దెబ్బ కొట్టే రాతలు సహించం

అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తుంటే కొన్ని మీడియా సంస్థలు వక్రబుద్ధితో లేనివి ఆపాదించి తప్పుడు రాతలు రాస్తున్నాయని విద్యా శాఖ
మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.పేదింటి పిల్లలు ప్రగతి సాధిస్తుంటే వారి భవిష్యత్తుపై దెబ్బ కొట్టే రాతలను సహించబోమని హెచ్చరించారు. తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసే వార్తలు ప్రచురించడం దారుణమైన చర్య అని అన్నారు.

# ఓటమి ఎరగని నాయకున్ని

హుజురాబాద్, గజ్వేల్ ఓటమితో నాలో కసి పెరిగింది.....

కార్యకర్తలకు అండగా ఉంటా....

పార్టీ బలోపేతం కోసం పనిచేయండి...

నన్ను ఆదరించిన ప్రజలకు రుణపడి ఉంటా....

బిజెపి నేత ఈటెల రాజేందర్



(గజ్వేల్ నేను గజ్వేల్ లో పోటీ చేయడంతోనే నియోజకవర్గ ప్రజలకు విలువ వచ్చిందని నన్ను ఓడగొట్టాలని ప్రయత్నంలో టిఆర్ఎస్ నేతలు డబ్బులను, మద్యాన్ని ఏరులై పారించారని , వారి మాటలను విశ్వసించకుండా నాపై నమ్మకంతో నాకు ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని హుజరాబాద్ మాజీ ఎమ్మెల్యే భాజపా నేత ఈటెల రాజేందర్ అన్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం లోని ములుగు వర్గల్ జగదేవ్ పూర్ మండలం ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు గత చరిత్రలో బిజెపి ఒంటరిగా పోటీ చేసి ఎప్పుడు కూడా ఇంతమంది ఎమ్మెల్యేలు గెలిపించుకోలేదని కానీ ఈ ఐదేళ్లలో చేరుకొని నాలుగు పార్లమెంటు స్థానాలను అందంగా అసెంబ్లీ స్థానాలను బిజెపి నిలిచిందని సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నరేంద్ర మోడీ గారికి ఇచ్చిన నినాదాన్ని ప్రతి కార్యకర్త నడుచుకోవాలన్నారు. కెసిఆర్ తట్టుకునే సత్తా ఈటల రాజేందర్ కే ఉందని నమ్మి నన్ను ఆదరిస్తున్న ప్రజలకు ఎల్లప్పుడూ నా సహకారం అందిస్తానని, పేదల నుండి భూములు లాక్కొని బడా బడా కంపెనీలకు లక్షల్లో భూములు అమ్ముకున్నారని కెసిఆర్ ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఏ ఒక్కరి కోసమో భాజపా తన సిద్ధాంతాలు మార్చుకోదని ప్రజల సమస్యలపై భాజాపా పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. నాయకుల మధ్య విభేదాలు విడి కొత్త పాత అని తేడా లేకుండా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భాజపా అభ్యర్థి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజలను నమ్మదు కాబట్టి గెలిచిన అభ్యర్థులను డబ్బులు ఎర్రచూపి ఇతర ప్రలోభాలు చూపి అధికారం చేసిపించే సంస్కృతి కేసీఆర్ దీ అని , ఓటమి తప్పదని తెలిసి కొండపోచమ్మ సాగర్ మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇంటికో లక్ష ఇస్తామని ఆశ చూపి వాళ్ల మనసును మార్చారని, మళ్లీ మనమే అధికారంలోకి వస్తున్నామని నమ్మించి దళిత బంధు బిసి బందు గృహలక్ష్మి పథకాలకు సంబంధించిన ప్రోసిడింగ్లన్నీ రద్దయాయని కెసిఆర్ ప్రభుత్వం అనుసరించిన నీచ సంస్కృతి దేశంలో ఏ రాష్ట్రంలో జరగలేదని హుజురాబాద్ గజ్వేల్ లో ఓటమి చెందడంతో నాలో మరింత కసి పెరిగిందని తప్పకుండా కేసీఆర్ పతనం కోసం కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా భాజపా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి మాజీ జడ్పిటిసి లు సింగం సత్తయ్య సురేష్ గౌడ్ బిజెపి నేత నందన్ గౌడ్ , పార్టీ సీనియర్ నాయకులు మాదాటి జస్వంత్ రెడ్డి , ములుగు, వర్గల్ ,జగదేవ్ పూర్ భాజపా మండల అధ్యక్షులు రమేష్ యాదవ్ శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి బిజెపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయ ప్రతిష్ట తేది ఫిబ్రవరి 22 న నిర్ణయం



14-12-2023 ఆత్మకూరు(యం) లో శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ట నిర్మాణం చేయుచున్న నూతన దేవాలయములో వచ్చే ఫిబ్రవరి 22 న జరుపుటకు వేదపండితులు గ్రామం ఫెద్దల సమక్షంలో నిర్ణయం జరిగిందని నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్ రెడ్డి, ఏనుగు సుగంధిని దంపతులు తెలియచేసారు. వీరి తాత ఏనుగు రాజిరెడ్డి పూర్వకాలంలో వారి స్వంత భూమిలో నిర్మించిన దేవాలయం జీర్ణోద్ధరణ జరిగినందున అట్టి స్థలంలో పునః నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు. కనకదుర్గమ్మ తో పాటు శివుడు, ఆంజనేయస్వామి, సంతోషిమాత ,గణపతి విగ్రహాలు ప్రతిష్టించనున్నట్లు సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం వేదపండితులు నర్సింహాచార్యలు, కార్తీక్ పంతులు చేతులు మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, యంపిటిసీ యాస కవిత ఇంద్రారెడ్డి, బొబ్బిలి లాల్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, సోలిపురం శ్రీనివాస్ రెడ్డి, జక్క శివ్వారెడ్డి, మజ్జిగ రాంబాబు, మల్లయ్య, స్థపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# బ్రిలియంట్ స్కూల్ లో వెజిటబుల్ డే



14-12-2023 ఆత్మకూర్(యం)ఈ రోజు బ్రిలియంట్ స్కూల్ లో వెజిటబుల్ డే నిర్వహింఛారు విధ్యార్థుల వివిధ రకాల కూరగాయలు ప్రదర్శించారు ఈ సంధర్భంగా పాఠశాల చైర్మన్ మాజీ జెడ్పీటిసి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు అన్నిరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ పావని కోటేశ్వరి ఉపాధ్యక్షులు వైష్ణవి, విజయలక్ష్మి, రజిత, నాగలక్ష్మి, లావణ్య, అశ్విని, సూర్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ లారీ ఢీ ప్రయాణికులకు స్వల్ప గాయాలు..



పెద్దవూర

నిన్నటి రోజు అనగా తేదీ 13.12.2023 రోజున రాత్రి మాచర్ల డిపో కు చెందిన సూపర్ లక్సరీ బస్ నెంబర్ : %ఞా-07ౄ%-0580 గల దాని డ్రైవర్ 37 మంది ప్రయానికులను తీసుకొని హైదరాబాద్ కు వెళ్తుండగా రాత్రి 12.00 గంటల సమయంలో పెద్దవూర మండల పరిధిలో తుంగతుర్తి గ్రామం స్టేజి వద్దకు రాగా అక్కడ ఒక టిప్పర్ లారీ బ్రేక్ డౌన్ అవడం వల్ల సదరు లారీ డ్రైవర్ టిప్పర్ ను నిర్లక్ష్యంగా రోడ్డు దించకుండా పార్క్ చేయడంతో, మాచర్ల నుండి వస్తున్న బస్ టిప్పర్ లారీ ను వెనుక నుండి ఢీ కొట్టింది.. అట్టి ప్రమాదంలో బస్ డ్రైవర్ తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయినాయి.. ఢీ కొట్టుకున్న వాహనాలను రెండు క్రైన్ల సహాయంతో ప్రక్కకు తీస్తుండగా, ఒక క్రైన్ డ్రైవర్ టిప్పర్ లారీ కు తాళ్ళు కడుతుండగా, ఇంకో క్రైన్ ప్రమాదవాశాత్తు ముందుకు జరగడంతో డ్రైవర్ విజయ్ కుమార్ చౌరస్య %=/శీ% బీహార్, %ఘ్రవ%: 40 సంలు అను అతను టిప్పర్ లారీ మరియు క్రైన్ మధ్యలో ఇరుక్కొని చనిపోవడం జరిగింది...

ఇట్టి విషయంలో మృతుడి సడ్డకుడు అజయ్ చౌరస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించానైనది...మృతుడికి భార్య, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి సంతానం కలరు... మృతుడు సుంకిశాల ప్రాజెక్ట్ లో క్రేయిన్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు.. అతని కుటుంబ సభ్యులు బీహార్ లో వుంటారు అని ఏ రమేష్ ఎస్సై పెద్దవూర పి ఎస్ తెలిపారు

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు గురించి చర్చిస్తున్న ప్రజల మనిషి రాజన్న



చౌటుప్పల్ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి ఆర్ బి రాములు ఇందిరమ్మ పాలనలో అంద రూ బాగుండాలి అనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను నెరవేర్చ బోతు న్నది. చౌటుప్పల పట్టణ కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూ స్తున్నటువంటి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కల నెరవేర్చేందుకు మునుగోడు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిగారి సహకారం తోగౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ వెన్ రెడ్డి రాజు గారుఅహర్నిశలు శ్రమిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేస్తది చేసేది చెప్తది అనే మాటకు కట్టుబడిఎన్నికలలో ఇచ్చిన హామీకి కట్టుబడి డిగ్రీ కాలేజీ ఏర్పాటుకి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్. రావు లెక్చరర్ సూర్యనారాయణ గారితో చర్చించారు. త్వరలోనే చౌటుప్పల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు.

# జిట్టా బాలకృష్ణా రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



వలిగొండ డిసెంబర్ 14 : తెలంగాణ ఉద్యమ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణా రెడ్డి జన్మదినం సందర్భముగా భువనగిరి లోని ఆయన ఫామ్ హౌజ్ లో గురువారం వలిగొండలోని జిట్టా యువసేన నాయకులు పూల బొకేతో, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నానచర్ల రమేష్, మస్కు నర్సింహా, కొండూరు సత్తయ్య, లవకుమార్, అంబటి మోహన్, యాదగిరి, మత్స్యగిరి,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త యానాల రాంరెడ్డి

చౌటుప్పల మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి ఆర్ బి రాములురాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా యానాల రాంరెడ్డి ప్రముఖవు ఉప ముఖ్యమంత్రి గారికి పుష్పగుచాలతో పాటు శాలువతో సన్మానించారు అనంతరం రామ్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడినటువంటి ప్రభుత్వానికి స్వచ్ఛందంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇతర సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వానికి సహకరించవలసిం దిగా ఆయన కోరారు రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పనిచేయడానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు మునుగోడు నియోజకవర్గంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బెల్ట్ షాపులు ఎత్తివేసి నిర్ణయ కార్యక్రమానికి పూర్తిగా అభినందిస్తున్నామని ఎన్నో జీవితాలు విభిన్నమైన కారణాలతో చెల్లా చెదిరే అని గుర్తించారు

దీనికి ముందుకు మూలం కేవలం బెల్ట్ షాపుల ద్వారానే జీవితాలు సర్వనాశనమైతున్నాయని తెలిపారు రాజగోపాల్ రెడ్డి గారు తీసుకున్నటువంటి నిర్ణయానికి లక్ష్మీ నరసమ్మఫౌండేషన్ ద్వారాఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడానికి

ముందుకు వస్తామని తెలిపారు అంతేకాకుండా నారాయణపురం మండల కేంద్రంలోని ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలకు అనాధ పిల్లలైనటువంటి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే దిశలో ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు సేవా కార్యక్రమాల ద్వారా తనకు వచ్చే డబ్బులోకొద్దీ పేద మధ్యతరగతి విద్యార్థులకు పంచడమే నా యొక్క ఏకైక లక్ష్యంగా భావిస్తున్నానని తెలిపారు రానున్న రోజులలో మునుగోడు నియోజకవర్గంలో ఉన్నటువంటి విద్యార్థులందరికీ సహాయ సహకారాలు అందించే దిశలో ప్రయత్నం చేస్తానని తెలిపారు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటు వంటి ఆర్ గ్యారంటీల పథకాన్ని ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేసి ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కంటే రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో సమస్యలు లేకుండా సస్యశ్యామలంగా ఉండేటువంటి కార్యక్రమాన్ని తీసుకొని ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.



# ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

## – ప్రజాభవన్‌ను స్కిల్ సెంటర్‌గా మారుస్తామన్నారు
## –హామీల అమలుకు పోరాడుతామన్న బిజెపి ఎమ్మెల్యేలు



హైదరాబాద్,డిసెంబర్14: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, హామీల అమలు జరిగే వరకు ప్రజల పక్షాన నిలబడతామని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాగానే హామీలు వెంటనే అమలు చేస్తామని ప్రకటించినందున అందుకు తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను స్టడీ సర్కిల్‌గా మారుస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌గా మారుస్తామని చెప్పిందీ వారే..ఇప్పుడు డిప్యూటి సిఎంకు కేటాయించిందీ వారునని గుర్తు చేశారు. ఇకపోతే రైతు బంధులో కోత విధించడం సరైంది కాదన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ మాట్లాడుతూ.. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ముందు ప్రమాణం చేయమని ముందే చెప్పామని, ఆ మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలందరూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముందు ప్రమాణం చేశామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటిలతో అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పుల పాలు చేసి వెళ్ళిపోయారన్నారు. ఇచ్చిన గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అమలు చేస్తుందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలకు నిధులు కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ నుంచి తెస్తారా? లేక ఇటలీ నుంచి తెస్తారా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. ఆ పార్టీపై తమ యుద్ధం మొదలైందని రాజసింగ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ముందు ప్రమాణ స్వీకారానికి నిరాకరించడంతో తెలంగాణ అసెంబ్లీలో రాజా సింగ్, కొత్తగా ఎన్నికైన మరో ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ప్రమాణం చేశారు. స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన వెంటనే బీజేపీ ఎమ్మెల్యేలు సభకు హాజరై ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా ఏఐఎంఐఎం ఎమ్మెల్యే ఒవైసీని నియమిం చడాన్ని నిరసిస్తూ రాజా సింగ్‌తో పాటు మరో ఏడుగురు తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలు డిసెంబర్ 9న సభా కార్యక్రమాలను బహిష్కరించారు. ఒవైసీ కంటే సీనియర్ సభ్యులు ఉన్నందున నిబంధనలను ఉల్లంఘించి ప్రొటెం స్పీకర్‌గా నియమించారని కాషాయ పార్టీ ఆరోపించింది. ఆయన నియామకంపై బిజెపి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాల ముసుగులో కొన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టడానికి ఉద్దేశపూర్వకంగా నిబంధనలను ఉల్లంఘించిందని ఒక మెమోరాండంలో ఆరోపించింది.

ప్రొటెం స్పీకర్‌గా ఒవైసీ నామినేషన్‌ను పక్కన పెట్టాలని, కొత్తగా ఏర్పాటైన అసెంబ్లీకి పూర్తిస్థాయి స్పీకర్‌ను ఎన్నుకునే ప్రక్రియను నిలిపివేయాలని గవర్నర్‌ను కోరింది.

## కరాచీ బేకరీ గోడన్‌లో పేలిన సిలిండర్

### - ప్రమాదంలో 15మంది కార్మికులకు గాయాలు
### -ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

హైదరాబాద్,డిసెంబర్14 హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్‌లోని కరాచీ బేకరీలో సిలిండర్ పేలింది. కరాచీ బేకరీ క్యాంటీన్లో ఒక్కసారిగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు 15 మందికి గాయాలవగా.. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

కరాచీ బేకరీ గోడౌన్‌లో గురువారం జరిగిన అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన 15 మంది కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ఉమ్మడి జిల్లాలో స్థానిక పోరుపై ఆసక్తి

### – అప్పుడే పరోక్ష ప్రచారాల్లో నేతలు

నిజామాబాద్,డిసెంబర్14 2014 నుంచి 2023 వరకు గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల బలోపేతం అయ్యాయి. అధికార వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలు, మండలాలు, కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటుతో పాటు కొత్త మండల పరిషత్‌లు ఆవిర్భవించాయి. గతంలో ఉన్న మండల పరిషత్‌ల రూపురేఖలు మారాయి. గత ఎన్నికల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని జడ్పీ చైర్మన్ పీఠాలు, మండలాల్లో ఎంపీపీ పదవులన్నీ బీఆర్ఎస్ ఖాతాలోకే వచ్చాయి. అరకొర స్థానాలతోనే కాంగ్రెస్, బీజేపీ సరిపెట్టుకున్నది. బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశంగా ఉపయోగపడనున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం 29 పాత మండలాల్లో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 27 మండలాల పరిధిలో 4932 మంది వార్డు సభ్యులున్నారు. అలాగే 299 మంది ఎంపీటీసీ స్థానాలు 27 మండలాలకు జడ్పీటీసీలున్నాయి. కామారెడ్డి జిల్లాలో 22 పాత మండలాల పరిధిలో(ప్రస్తుతం 25 మండలాలు) 4642 వార్డు మెంబర్లు, 236 ఎంపీటీసీలు, 22 మంది జడ్పీటీసీలు ఉన్నాయి. బాన్సువాడ, ఎల్లారెడ్డి, భీమ్‌గల్ మాదిరిగా కొన్ని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలుగా మారడంతో వాటిని మండల పరిషత్ నుంచి తొలగించడం ద్వారా భౌగోళిక స్వరూపంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కేసీఆర్ సంకల్పంతో గతంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో కూడా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు, చేర్పులు జరగడం ద్వారా మెండుగా రాజకీయ అవకాశాలు సైతం కల్పించబడ్డాయి. ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో గతంలో 583 ఎంపీటీసీ స్థానాలుండగా కామారెడ్డి జిల్లాలో పాత ఎంపీటీసీ స్థానాలు 256, నిజామాబాద్ జిల్లాలో 327 ఎంపీటీసీ స్థానాలు కేటాయించారు. పునర్విభజనలో పలు విలీన గ్రామాలను తీసివేయడం ద్వారా అనేక చోట్ల ఎంపీటీసీ స్థానాలు కొన్ని రద్దు చేయబడ్డాయి. దీంతో ప్రస్తుతం కామారెడ్డిలో 236 ఎంపీటీసీ, నిజామాబాద్ లో 299 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాల పునర్విభజనను గత ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించడం ద్వారా కొత్త ఎంపీటీసీ స్థానాలను, జడ్పీటీసీ స్థానాల పరిధితో స్థానిక సంస్థలు బలోపేతమయ్యాయి.

## భవిష్యత్ ఎన్నికల్లో మనదే విజయం

### – ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదు
### – మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి భరోసా



నిజామాబాద్,డిసెంబర్14 పార్టీ అధికారంలోకి రాలేదని కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని, కష్టపడినవారికి స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పిస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాం రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ తన హామీలను నిలుపుకోక పోతే ప్రజలే నిలదీస్తారని అన్నారు. ఇందుకు ఎంతో సమయం కూడా పట్టదని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం బీఆర్ఎస్కు కంచుకోట అని నిరూపించారని అన్నారు. అయితే జిల్లాలో మిగా స్థానాల్లో కూడా ఓటమిపై పార్టీ విశ్లేషిస్తుందని అన్నారు. కేసీఆర్ దార్శనికత, అభివృద్ధి ముందు కాంగ్రెస్ నిలవదని అన్నారు. అధికారంలోకి రాకపోవడం ఎవరూ నిరుత్సాహ పడవద్దని అన్నారు. ముందంతా మనకే అనుకూల మని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే మనకు విజయబాట కానుందన్నారు. రానున్న అన్ని ఎన్నికల్లో భవిష్యత్ బీఆర్ఎస్‌దే అని పేర్కొన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల తప్పుడు ప్రచారాన్ని నమ్మి ప్రభుత్వంలోకి తెచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని, పిలిచిన వెంటనే వస్తానని భరోసా ఇచ్చారు. మీకు అన్నివిదాలుగా అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకుల కృషి ఫలితంగానే తాను గెలిచానని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తానని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడమంటే ప్రజలు తామను తామే ఓడించుకున్నట్టు అని పేర్కొన్నారు. కాంగ్రెస్కు అధికారమిచ్చి అభివృద్ధిని నాశనం చేసుకున్నారని త్వరలోనే తేలనుందని అన్నారు.ఆరు నెలలు దాటితే కాంగ్రెస్ పరిపాలనా సత్తా ఎంటన్నది ప్రజలే గుర్తిస్తారని అన్నారు.

## శబరిమలకు పోటెత్తిన అయ్యప్ప భక్తులు

### – ట్రాఫిక్ చిక్కుల్లో శబరి పరిసరాలు
### –పంబకు వాహనాల నిలిపివేత
### –రంగంలోకి దిగ చక్కదిద్దిన ప్రభుత్వం




తిరువంతపురం,డిసెంబర్14: అయ్యప్పస్వామి దర్శనం కోసం శబరి మలకు భక్తుల రద్దీ కొనసా గుతోంది. శబరి మలకు భక్తులు పొటెత్తడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. లక్షల మంది భక్తులు అయ్యప్ప దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. అయ్యప్ప దర్శనానికి వెళ్లిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంబకు వాహనాలు అనుమతించడం లేదు. దీంతో రోడ్డుపైనే పాటలు పాడుతూ అయ్యప్ప భక్తుల ఆందోళనకు దిగారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో...అధికారులు పంబాకు వెళ్లే వాహనాలకు అనుమతి నిరాకరించారు ఫలితంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు రోడ్డుపైన నిరసనకు దిగారు. ఎరుమెలి– పంబా రోడ్డుపై అయ్యప్ప పాటలు పాడుతూ ఆందోళన నిర్వహించారు. పంబాకు వాహనాలు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని... అయ్యప్ప భక్తులతో ఆందోళనను విరమింపజేశారు. భక్తుల రద్దీ అదుపులోకి వచ్చాక వాహనాలను అనుతిస్తామని హామీ ఇవ్వడంతో భక్తులు వెనక్కితగ్గారు. భక్తుల ఆందోళనలపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కే రాధాకృష్ణన్ స్పందించారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామన్న ఆయన, భక్తుల కోసం ఆర్‌టీసీ బస్సులను సైతం వినియోగిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## తెలుగు రాష్ట్రాల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,డిసెంబర్14:తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. చలి తీవ్ర విపరీతంగా పెరిగింది. మరో మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. తర్వాత రెండుమూడు రోజుల వ్యవధిలో మళ్లీ చలి తీవ్రత పెరుగుతుందని అంటున్నారు. చలిగాలులు కూడా వీటికి జతకలిసే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల నుంచి 31 డిగ్రీల మధ్య ఉంటోంది. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత దిగువకు పడిపోయాయి. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో 12.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మెదక్, పటాన్‌చెరు, ఆదిలాబాద్, రామగుండంలో 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు రిజిస్టర్ అవుతున్నాయి. నిజామాబాద్, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, భద్రాచలంలో 20 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.

## కామారెడ్డి షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

### మంటలతో భారీగా ఆస్తి నష్టం



కామారెడ్డి,డిసెంబర్14 కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానిక అయ్యప్ప షాపింగ్ మాల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ తర్వాత మంటలు మాల్‌లోని మిగతా అంతస్థులకు చేరాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురై పరుగులు తీశారు. ఆ తర్వాత సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జేసీబీ సహాయంతో మాల్ షట్టర్లను తొలగించారు. ఉదయం 7 గంటల వరకు రెండు అంతస్తుల్లో మంటలను అదుపులోకి తీసుకురాగా.. మిగతా రెండు అంతస్తుల్లోని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, భారీగా అగ్నికీలలు ఎగిసిపడుతుండడంతో మంటలను అదుపు చేయడం కష్టంగా మారింది. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ప్రమాదంలో రూ.కోట్ల విలువైన సామగ్రి కాలిబూడిదైందని మాల్ నిర్వాకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఓయూలో విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్14 ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద గురువారం విద్యార్థుల ఆందోళనకు దిగారు. ఓయూ లైబ్రరీ నుండి పరిపాలన భవనం వద్దకు విద్యార్థులు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనానికి ఉన్న ముళ్ళ కంచెలు తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఇకనైనా ఓయూ వీసీ నియంతృత్వ పాలన విడాలని డిమాండ్ చేశారు. కాగా.. పరిపాలన భవన్ లోకి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించారు. సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేశారు.

## శ్రీ కృష్ణ జన్మభూమి కేసు

### షాహీ ఈద్గా కాంప్లెక్స్ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఆమోదం



లక్నో: ఉత్తరప్రదేశ్ మధురలోని షాహీ ఈద్గా కాంప్లెక్స్ ప్రాథమిక సర్వేకు అలహాబాద్ హైకోర్టు అనుమతినిచ్చింది. కోర్టు పర్యవేక్షణలో ముగ్గురు సభ్యుల అడ్వకేట్ కమిషనర్‌ల బృందం సర్వే నిర్వహిస్తుందని నిర్దేశించింది.ఇందుకు తగిన విధివిధానాలను డిసెంబర్ 18న నిర్ణయిస్తామని స్పష్టం చేసింది.'షాహీ ఈద్గా మసీదును అడ్వకేట్ కమిషనర్‌తో సర్వే చేయించాలనే మా అభ్యర్థనను అలహాబాద్ హైకోర్టు ఆమోదించింది. మసీదు లోపలి భాగంలో హిందూ దేవాలయాల చిహ్నాలు ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని తేల్చడానికి అడ్వకేట్ జనరల్ అవసరం. ఇది చరిత్రాత్మక తీర్పు.'

అని న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తెలిపారు.మధురలో దాదాపు 13.37 ఎకరాల భూమిలో ఉన్న శ్రీ కృష్ణుని ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగాజేబు షాహీ ఈద్గా మసీదును నిర్మించాడని హిందూ తరుపున పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ స్థలాన్ని శ్రీ కృష్ణ విరాజ్‌మాన్‌కు చెందినదిగా ప్రకటించాలని కోరుతున్నారు. మరోవైపు మసీదు ప్రాంతాన్ని కూల్చివేయవద్దని పిటీషన్లు దాఖలయ్యాయి.

## టిటిడి నిధులపై కన్నేసిన జగన్ ప్రభుత్వం

### – రాష్ట్రం దివాళా తీయడంతో స్వామి నిధులకు ఎసరు
### –బిజెపి అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ,డిసెంబర్14 టీటీడీ ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక క్షేత్రమని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. భక్తులు తమ ఇష్టదైవంపై నమ్మకంతో ఇస్తున్న కానుకలను దోచేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి అని.. భక్తుల కానుకలతో నడిచే ఏకైక దేవస్థానం టీటీడీ అని చెప్పుకొచ్చారు. రూపాయి కూడా ప్రభుత్వం నుంచి టీటీడీ ఖజానాకు రాదన్నారు. గత కొన్ని ఏళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ నిధులపై కన్నేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని.. అందుకు జగన్మోహన్ రెడ్డి కన్ను టీటీడీ ఖజానాపై పడిందన్నారు.

టీటీడీ నిధులను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఇది మంచిది కాదని భారతీయ జనతా పార్టీ హెచ్చరిస్తుందన్నారు. శ్రీవారి భక్తులను కలుపుకొని అనేక ఏళ్ళ నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. తిరుపతిలో శానిటేషన్ పేరిట 100 కోట్ల రూపాయలు టీటీడీ నిధులు ఖర్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీ నిధులు వినియోగిస్తున్నారన్నారు. ఇది చైర్మన్ కరుణాకర్ రెడ్డి కుమారుడుని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తిరుపతికి టీడీపీ నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.
కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ అయిన తర్వాత మూడు నెలల్లో రూ.200 కోట్ల పైన నిధులను ఖర్చు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఇవన్నీ జరుగుతున్న తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు మంచిది కాదని భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు.

## మెరుగైన వైద్య చికిత్స అందచేయాలి

### – సీఎం రేవంత్‌రెడ్డి



శంషాబాద్: శంషాబాద్ RGIA పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్ పహడ్‌లో పేలుడు సంభవించింది. ఓ కరాచీ బేకరీలో గ్యాస్ సిలిండర్ పేలింది. కరాచీ బేకరీ గోడౌన్‌లో ఒక్కసారిగా ప్రమాదం చోటు చేసుకోవటంతో 10 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి.ఈ ప్రమాద దాటికి కార్మికులకు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను పోలీసులు స్థానిక కంచన్బాగ్ డీఆర్డీఓ తరలించారు. అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉ?న్నట్లు తెలుస్తోంది. ఈ పేలుడు ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మెరుగైన వైద్య చికిత్స అందచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డికరాచీ బేకరీ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సదుపాయాలూ అందచేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి సీఎం రేవంత్ ఆదేశాలు ఇచ్చారు. గాయపడ్డ వారిలో ఎక్కువగా ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన కారికులున్నారని సీఎం రేవంత్‌కు అధికారులు తెలిపారు. గాయపడ్డ వారిలో 8 మందిని కంచన్బాగ్ డీఆర్డీఓ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ 15 మంది కార్మికులకు మెరుగైన వైద్య చికిత్సలు అందచేయాలని సంబంధిత ఆధికారులకు సీఎం రేవంత్ ఆదేశించారు.

### ఇచ్చిన హామాలను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి

–ఇదే విషయాన్ని చెప్పాను తప్ప మరోటి కాదు
– బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్,డిసెంబర్14 కాంగ్రెస్‌పై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ బొటాబొటీ మెజార్టీతో పాటు, ఆ పార్టీలో కలహాలు సహజమే అన్న రీతిలో తాను వ్యాఖ్యలు చేశానని అన్నారు. అయితే వాటిని తప్పుగా ప్రచురించారని అన్నారు .గురువారం అసెంబ్లీలో ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు బొటాబొటీ మెజార్టీ ఉందని.. కాంగ్రెస్‌లో గ్రూప్స్ కామన్ అని అన్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి కూడా వాళ్ళ హామీలకు సహకరించ దన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. బలమైన ప్రతిపక్షం ఉందన్నారు. మీరు బాగా పని చేయాల్సి ఉందని నేను చెప్పాను. మేము అన్న దాన్ని వక్రీకరించి కాంగ్రెస్ వాళ్ళే ఎక్కువ ప్రచారం చేసుకుంటున్నారు. వాళ్ళ మీద వాళ్ళకే నమ్మకం లేదు. భయపడు తున్నారు. అందుకే మేము ఒకటి మాట్లాడితే వాళ్ళు ఒకటి ప్రచారం చేసుకుంటున్నారని అంటూ కడియం శ్రీహరి పేర్కొన్నారు. అయినా హామీలు ఇచ్చింది వారు..అమలు చేయాల్సింది కూడా వారేనని అన్నారు. ప్రభుత్వంలోకి రాగానే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పారు గనక నిలబెట్టుకోవాలని తాము అడగడంలో తప్పులేదన్నారు.




## విద్యా రుణాలపై వడ్డీ రేట్లు ఎంతెంత?

గతంతో పోలిస్తే ఉన్నత విద్యకు ప్రాముఖ్యత పెరిగింది. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో సహాయపడడానికి భారత్‌లో ఉన్న ప్రముఖ బ్యాంకులు విద్యా రుణాలను అందిస్తున్నాయి.విద్యా రుణాలపై వివిధ బ్యాంకులు అందించే వడ్డీ రేట్లను కింది పట్టికలో చూడండి..



## మీ ఇంటిని, స్థలాన్ని అద్దెకు ఇస్తూ ఈ పొరపాట్లు చేయకండి..

### స్వాధీనం చేసుకుంటారు?



చాలా మంది ప్రజలు తమ నగరాన్ని విడిచిపెట్టి ఇతర నగరాలకు పనుల నిమిత్తం వెళ్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే ఇల్లు కొనడం అందరికీ సాధ్యం కాదు కాబట్టి అద్దెకు ఇల్లు తీసుకోవడానికే మొగ్గు చూపుతున్నారు.
దీని కారణంగా పెద్ద నగరాల్లో అద్దెదారుల సంఖ్య పెరుగుతోంది. ఇంటిని అద్దెకు తీసుకోవడానికి, అద్దెదారు, యజమాని మధ్య ఒక ఒప్పందం కుదుర్చుకోవడం జరుగుతుంది. ఇల్లు, దాని సంబంధిత నిబంధనలు, షరతులను కలిగి ఉంటుంది. కానీ, కొందరు యజమానులు అద్దెకు తీసుకున్న వ్యక్తి ఇంటిని గానీ, ఫ్లాట్‌నుగానీ స్వాధీనం చేసుకుంటాడేమోనని భయపడుతుంటారు.అద్దె తీసుకున్న వ్యక్తి ఇంటిని గానీ, ఫ్లాట్‌నుగానీ స్వాధీనం చేసుకున్నాడనే అప్పుడప్పునడు వింటుంటాము. ఇంటి యజమానులు తమ ఇంటిని అద్దెకు ఇచ్చే ముందు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. లేకపోతే కొన్ని పొరపాట్ల కారణంగా అద్దెదారు ఇంటిని స్వాధీనం చేసుకోవచ్చు. ఆ తప్పులు ఏమిటో తెలుసుకుందాం..తరచుగా, అద్దె ఒప్పందాన్ని చేసేటప్పుడు భూస్వాములు కొన్ని విషయాలపై శ్రద్ధ చూపడంలో విఫలమవుతారు. యజమాని మొదట అద్దెదారున్ని పోలీసు ధృవీకరణ చేయాలి. ఆపై అద్దె ఒప్పందంలో అతని నిబంధనలను రాయాలి. సాధారణంగా 11 నెలలకు అద్దె ఒప్పందం చేసుకోవడం మంచిది. ఎవరైనా ఎక్కువ కాలం అద్దె స్థలంలో ఉంటే కొన్ని నిబంధనల ప్రకారం ఆ ఆస్తి వారిదే అవుతుంది. అప్పుడు కోర్టు కూడా ఈ విషయంలో ఏమీ చేయదు. అద్దెదారు 12 సంవత్సరాల పాటు ఒక స్థలంలో ఉంటే, అతను దానిపై తన యాజమాన్య హక్కులను క్లెయిమ్ చేసుకోవచ్చని కూడా గతంలో సుప్రీంకోర్టు పేర్కొంది. బ్రిటీష్ కాలం నుంచి ఈ స్వాధీనం నియమం ఆచరణలో ఉంది. కానీ, కొన్ని పరిస్థితుల్లో ఈ నియమం చెల్లుబాటు కాదు. ఇలా ప్రభుత్వ భూముల్లో ఈ నిబంధన చెల్లదు. అంటే ఎవరైనా ప్రభుత్వ ఫ్లాట్‌లో నివసిస్తుంటే అతను ఈ ఇంటిని స్వాధీనం చేసుకోలేడు.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్..

### మాస్టర్ కార్డ్‌తో కలిసి ఎల్ఐసీ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు.. ఇవీ డిటైల్స్..!

గతంతో పోలిస్తే భారతీయుల్లో క్రెడిట్ కార్డు వాడకం పెరిగిపోయింది. బ్యాంకులతోపాటు ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు, ఈ-కామర్స్ జెయింట్స్ సైతం కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు జారీ చేస్తున్నాయి.

ఆ బాటలో భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) కూడా జత కలిసింది. అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ 'మాస్టర్ కార్డ్ (%మీుర్‌వతీ ఝుతీస%), ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ (%×ణఖీజ ఖీఱతీర్ దీుఅఔ%)తో కలిసి తాజాగా మరో కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ఆవిష్కరిస్తున్నట్లు ఎల్ఐసీ తెలిపింది. ఎల్ఐసీ అనుబంధ సంస్థ ఎల్ఐసీ కార్డ్స్ సారథ్యంలో ఈ క్రెడిట్ కార్డు జారీ చేస్తారు. ఈ క్రెడిట్ కార్డు 'ఎల్ఐసీ క్లాసిక్', 'ఎల్ఐసీ సెలెక్ట్' పేరుతో రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఈ క్రెడిట్ కార్డులతో దేశంలోని 27 కోట్ల మందికి పైగా బీమా పాలసీదారులు తమ బీమా ప్రీమియం చెల్లింపులపై రివార్డు పాయింట్లు పొందొచ్చునని ఎల్ఐసీ కార్డ్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, మాస్టర్ కార్డ్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

కార్డ్ కోల్పోయిన వారికి రూ.50 వేల, పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజీ రూ.5 లక్షలతోపాటు పలు ఇతర బెనిఫిట్లు లభిస్తాయి. 'గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ మాస్టర్ కార్డ్ భాగస్వామ్యంతో క్రెడిట్ కార్డు జారీ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ క్రెడిట్ కార్డు తీసుకున్న వారితోపాటు ఎల్ఐసీ పాలసీదారులకు ఈ అదనపు బెనిఫిట్లు పొడిగిస్తాం' అని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ వీ వైద్యనాథన్ తెలిపారు.







ఎల్ఐసీ చైర్మన్- ఎల్ఐసీ కార్డ్స్ చైర్మన్ సిద్ధార్థ మొహంతి మాట్లాడుతూ 'మా విలువైన కస్టమర్లకు బెస్ట్ సర్వీసులు అందించడానికి మా భాగస్వామ్యం కట్టుబడి ఉంటుంది. కస్టమర్ కేంద్రంగా సేవలందించేందుకు నూతన తరం బ్యాంక్‌గా ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌తోనూ, ఎల్ఐసీతోనూ భాగస్వామ్యం వల్ల మా పట్ల విశ్వాసం మరింత పెరుగుతుంది' అని తెలిపారు. సురక్షిత జీవితం కోసం డిజిటల్ టూల్‌గా మా క్రెడిట్ కార్డు దోహద పడుతుందన్నారు.?

వ్యక్తిగత ప్రమాద బీమాతోపాటు పలు రక్షణాత్మక కవరేజీలు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల లాంజీల్లోకి అనుమతి, పలు ట్రావెల్ బెనిఫిట్లు అందిస్తుందీ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు.



# ఈ 5గురి ప్లేయర్స్ ఫ్రాంచైజీల టార్గెట్

ఐపీఎల్ 2024 మినీ వేలానికి వేళాయే. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఈ వేలం జరగనుంది. ఈసారి 1,166 మంది ప్లేయర్స్ రిజిస్టర్ చేసుకోగా.. వీరిలో 830 మంది భారత క్రికెటర్లు ఉన్నారు. ఇక ఈ లిస్టులో 212 మంది క్యాప్డ్ ఆటగాళ్లు, 909 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ ఉన్నారు. ఐపీఎల్ 2024 మినీ వేలానికి వేళాయే. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఈ వేలం జరగనుంది.
ఈసారి 1,166 మంది ప్లేయర్స్ రిజిస్టర్ చేసుకోగా.. వీరిలో 830 మంది భారత క్రికెటర్లు ఉన్నారు. ఇక ఈ లిస్టులో 212 మంది క్యాప్డ్ ఆటగాళ్లు, 909 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ ఉన్నారు. ఆ 5గురు ఆటగాళ్లు వరల్డ్‌కప్ హీరోస్ కాగా.. అన్ని ఫ్రాంచైజీలు కూడా వారినే టార్గెట్‌గా పెట్టుకున్నాయి. ఎంత ఖర్చైనా పర్లేదు.. తగ్గేదేలే అంటూ వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ ఐదుగురు ప్లేయర్స్ లిస్టులో వన్డే వరల్డ్‌కప్ 2023 ఫైనల్ హీరో ట్రావిస్ హెడ్ ముందున్నాడు. ఫైనల్‌లో భారీ సెంచరీతో ట్రోఫీని టీమిండియా నుంచి లాక్కున్న హెడ్.. ఫార్మాట్ ఏదైనా కూడా పరుగుల వరద పారిస్తాడు. ఇక అతడి దూకుడైన ఆటతీరే.. ఫ్రాంచైజీలను ఆకట్టుకుంది. ఇతడి కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య పెద్ద వార్ జరగొచ్చు. లిస్టులో ఉన్న మరో ప్లేయర్.. రచిన్ రవీంద్ర. అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌తో వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించాడు. మెగాటోర్నీలో 578 పరుగులు సాధించి.. ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిలో పడ్డాడు. ఆల్‌రౌండర్ కోసం వెతుకుతున్న ఫ్రాంచైజీలు ఇతడిపై కాసుల వర్షం కురిపించడం ఖాయం. 18 మంది ఆటగాళ్లు తప్పనిసరి: ఐపీఎల్‌లో ఒక జట్టులో 18 మంది ఆటగాళ్లు ఉండటం తప్పనిసరి. అంటే, వేలం తర్వాత ఏ ఐపీఎల్ జట్టు 18 మంది కంటే తక్కువ ఆటగాళ్లను కలిగి ఉండకూడదు. అంటే 18 నుంచి 25 మధ్య మీకు కావలసినంత మంది ఆటగాళ్లు ఉండవచ్చు. న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్ డారెల్ మిచెల్, దక్షిణాఫ్రికా పేసర్ గెరాల్డ్ కోయెట్జీ కోసం కూడా ఐపీఎల్ ఫ్రాంచైజీలు పోటీ పడుతున్నాయ్. ఆర్సీబీ, కేకేఆర్, పంజాబ్, ముంబై జట్లు వీరి కోసం కాసుల వర్షం కురిపించే ఛాన్స్ ఉంది.

# కోహ్లీ అద్భుతాలు చేస్తేనే విజయం

గత ఐదేళ్లలో టీమిండియా రెండుసార్లు ఆస్ట్రేలియా గడ్డపై విజయం సాధించింది. 16 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్ గెలిచింది. ఆ తర్వాత మూడుసార్లు ఓడిపోయిన తర్వాత 2021-22లో సిరీస్‌ను డ్రా చేసుకుంది. న్యూజిలాండ్‌లో కూడా గత కొన్నేళ్లుగా విజయం కోసం ఎదురు చూస్తున్నా.. అక్కడ జట్టు ఇంతకు ముందు రెండుసార్లు సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక ఒక్క దేశమే మిగిలి ఉంది. అదే దక్షిణాఫ్రికా. ఇక్కడ టీమ్ ఇండియా ఇప్పటి వరకు విజయం సాధించలేదు. మరి ఈసారి సక్సెస్ అవుతుందా? అయితే, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జాక్వెస్ కల్లిస్ ప్రకారం ఓ ఆటగాడు రెచ్చిపోతే ఇది తప్పకుండా సాధ్యమవుతుందని, టీమిండియా తమ కల నెరవేర్చుకుంటుందని తెలిపాడు. దక్షిణాఫ్రికాలో తొలి టెస్టు సిరీస్ విజయం కోసం టీం ఇండియా ఇంకా ఎదురుచూస్తోంది. 2010-11లో అక్కడ సిరీస్‌ను డ్రా చేసుకోవడంలో భారత జట్టు విజయం సాధించింది. ఈ దేశంలో టీమ్ ఇండియా ఓటమిని ఎదుర్కోవాల్సిన అవసరం లేని సందర్భం ఇదే. అయితే కొన్ని సందర్భాల్లో, టీమ్ ఇండియా విజయానికి పోటీదారుగా నిలిచింది. కానీ, కొన్ని తప్పిదాల కారణంగా, అది



కోల్పోయింది. ఇప్పుడు మరోసారి భారత జట్టు విజయ ధీమాతో అక్కడికి వెళుతోంది.డిసెంబర్ 26 నుంచి సెంచూరియన్‌లో ఇరు జట్ల మధ్య 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. టీమ్ ఇండియా ఈసారి కూడా పటిష్టంగా ఉంది. అయితే ప్రతిసారీలాగే, దక్షిణాఫ్రికాను దాని స్వంత మైదానంలో ఓడించడం చాలా కష్టమైన పని. ఈసారి టీమిండియా విజయం సాధించాలంటే ఒక ఆటగాడి పాత్ర అత్యంత కీలకమని, అది మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం జాక్వెస్ కల్లిస్ అభిప్రాయపడ్డాడు. కోహ్లీ సారథ్యంలో భారత జట్టు 2018, 2021లో ఇక్కడికి వచ్చి రెండుసార్లు వచ్చింది. 2021-22లో టీమ్ ఇండియా ఆధిక్యంలోకి వెళ్లినా ఓడిపోయింది. కెప్టెన్‌గా, కోహ్లీ ఇందులో విఫలమైయ్యాడు. దక్షిణాఫ్రికా తరపున 13 వేలకు పైగా టెస్టు పరుగులు చేసిన వెటరన్ బ్యాట్స్‌మెన్ కల్లిస్, కోహ్లీ మంచి ఫామ్‌లో ఉన్నాడని, దానిని దక్షిణాఫ్రికాలో కొనసాగించాలనుకుంటున్నాడు. భారత్ తరపున కోహ్లీ కీలక పాత్ర పోషిస్తాడని, టీమ్‌ఇండియా సిరీస్‌ను గెలవాలంటే, ఈ సిరీస్‌లో కోహ్లీ పటిష్ట ప్రదర్శన చేయడం చాలా ముఖ్యమని కల్లీస్ చెప్పుకొచ్చాడుదక్షిణాఫ్రికాలో విరాట్ కోహ్లీ ప్రదర్శన బాగానే ఉంది. క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, స్టార్ బ్యాట్స్‌మన్ 14 ఇన్నింగ్స్‌లలో 2 సెంచరీలు మరియు 3 అర్ధ సెంచరీలతో సహా 719 పరుగులు చేశాడు. ప్రస్తుత భారత జట్టులో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు మరియు అతను మాత్రమే ఇక్కడ సెంచరీ చేయగలిగాడు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియా బ్యాటింగ్ కచ్చితంగా కోహ్లిపైనే ఆధారపడి ఉంటుంది.

### కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్!!!




ఇండియన్ ప్రీమియర్ లీగ్-2024 సీజన్‌కు ఇంకా మూడు నెలలుకు పైగా టైం ఉంది. అయితే, ఇప్పటి నుంచే ఐపీఎల్ గురించి ఫ్యాన్స్‌లో తెగ చర్చ కొనసాగుతుంది. అందులోనూ డిసెంబర్ 19న ఐపీఎల్ ఆక్షన్ ఉండడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుంటున్నారు. చెన్నై, ముంబై జట్ల ఫ్యాన్స్ కు కెప్టెన్ ఎవరనేది అందరికి తెలుసు.. కెప్టెన్సీ విషయంలో ఈ రెండు జట్ల గురించి పెద్దగా చర్చ జరగదు.. కానీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల సారథులు ఎవరు అనే దాన్నిపై క్రికెట్ అభిమానులు తెగ ఆసక్తి చూపిస్తుంటారు. ఎందుకంటే ఈ రెండు జట్లకు కెప్టెన్సీ మార్పు చాలా అవసరం.. ఇదే టైంలో కేకేఆర్ నుంచి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది.అయితే, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యరే కొనసాగుతాడని కేకేఆర్ సీఈఓ వెంకీ మైసూర్ వెల్లడించారు. శ్రేయాస్ గాయం కారణంగా గత సీజన్ లో ఐపీఎల్‌లో ఆడలేదు.. దీంతో ఆ సీజన్‌లో నైట్ రైడర్స్ టీమ్ పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. ఆడిన 14 మ్యాచ్‌ల్లో కేవలం ఆరు మ్యాచ్‌లే గెలిచింది. ఇక, ప్రస్తుతం శ్రేయాస్ అయ్యర్ గాయం నుంచి కోలుకోని వరల్డ్‌కప్‌లోనూ అదరగొట్టడంతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో అయ్యర్‌కి కెప్టెన్సీ బాధ్యతలను కేకేఆర్ యాజమాన్యం అప్పగించింది. ఇక, వైస్ కెప్టెన్‌గా నితీశ్‌రాణాను ఎంపిక చేసింది.



# పూజాను చంపేస్తామన్న వార్తలు పుకార్లే

పూజా హెగ్డేను చంపేస్తామంటూ వచ్చిన ఫోన్ కాల్ నిజం కాదని ఆమె టీమ్ క్లారిటీ ఇచ్చింది. తాజాగా పూజాకు బెదిరింపు కాల్స్ వచ్చాయంటూ బాలీవుడ్ మీడియా కోడై కూసింది. దీనికి కారణం దుబాయ్‌లోని ఓ కార్యక్రమానికి వెళ్లారని.. అక్కడ గొడవ జరగడంతో కొందరు వ్యక్తులు ఆమెను చంపేస్తామంటూ బెదిరించారని బాలీవుడ్ మీడియాలో ఓ వార్త వచ్చింది. దీంతో ఆమె ఫ్యాన్స్ కంగారుపడి సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారు. తాజాగా దీనిపై పూజా టీమ్ క్లారిటీ ఇచ్చింది. అలాంటిదేమీ లేదని స్పష్టం చేసింది. 'అసలు నిజానిజాలు తెలుసుకోకుండా ఇలాంటి తప్పుడు వార్తలను ఎందుకు ప్రచారం చేస్తారో అర్థం కాదు. ఇందులో ఎలాంటి నిజం లేదు. దయచేసి ఇలాంటి అవాస్తవాలను నమ్మకండి' అని ఓ ప్రకటనలో పూజా హెగ్డే పీఆర్ టీమ్ తెలిపింది. దాంతో ఆమె. దీంతో పూజా అభిమానులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పూజాహెగ్డే తాజాగా 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' సినిమాలో కనిపించారు. త్రివిక్రమ్-మహేశ్‌ల కాంబోలో వస్తోన్న 'గుంటూరు కారం'లో మొదట ఆమెనే హీరోయినగా ఎంపిక చేశారు. పలు కారణాల వల్ల ఆమె ఆ చిత్రం నుంచి వైదొలిగారు. ప్రస్తుతం షాహిద్ కపూర్ హీరోగా మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఓ బాలీవుడ్ చిత్రంలో పూజా నటిస్తున్నారు.




# నా సామిరంగాలో అల్లరి నరేశ్

చాలా రోజుల తర్వాత టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున నటిస్తున్న పూర్తిస్థాయి మాస్ చిత్రం 'నా సామిరంగ'. ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తుండగా.. విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. శ్రీనివాస్ చిట్టూరి నిర్మాత. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే.. తాజాగా ఈ మూవీ నుంచి మరో స్టార్ కాస్ట్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అల్లరి నరేష్ అంజి అనే ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిపింది. ఈ విషయాన్ని తెలుపుతూ.. మా అంజి గాడ్ని పరిచయం చేస్తున్నాం లేదంటే మాటొచ్చేత్తది అంటూ రాసుకొచ్చింది. ఇక అంజి గాడికి సంబంధించిన స్పెషల్ ఇంట్రో ప్రోమోను రేపు ఉదయం 10.18 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు ఈ సినిమా నుంచి ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ పాట చూస్తే.. హీరో హీరోయిన్ల మధ్య సాగే కలర్ ఫుల్ ట్రాక్ సినిమాకు హైలెట్ కానుందని విజువల్స్ చెబుతున్నాయి. ఈ మూవీకి ఆస్కార్స్ విన్నింగ్ మ్యూజిక్ కంపోజర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు.

# 19న హనుమాన్ ట్రైలర్ విడుదల




టాలీవుడ్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం హను మాన్. భారతీయ ఇతిహాసాల్లోని హనుమంతుని కథ స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందిస్తున్నట్టు తెలుస్తుండగా, ఇందులో జాంబి రెడ్డి కథానాయకుడు తేజ సజ్జా హీరోగా నటిస్తున్నాడు. ఇక సూపర్ హీరో సిరీస్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన టీజర్ హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. యూనివర్సల్ ప్రేక్షకులను సైతం ఆకట్టుకునే హై టెక్నికల్ వాల్యూస్‌తో కట్ చేసిన విజువల్స్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ట్రైలర్ ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు తెగ వెయిటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సినిమా ట్రైలర్‌కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. హనుమాన్ ట్రైలర్ ను డిసెంబర్ 19న లాంఛ్ చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. అయితే ఈ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లోని ఏషియన్ మహేష్ బాబు మాల్‌లో(ఏఎంబీ) నిర్వహించనున్నట్లు చిత్రయూనిట్ తాజాగా ప్రకటించింది. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.


# సలార్‌కు ముందే బఘీరా టీజర్ విడుదల




'కేజీఎఫ్', కాంతారా చిత్రాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రస్తుతం సలార్ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాతో పాటు మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది. కన్నడ స్టార్ హీరో శ్రీమురళి హీరోగా హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'బఘీరా'. ఈ సినిమాకు 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ కథ అందిస్తుండగా.. డాక్టర్ సూరి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ టీజర్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను శ్రీమురళి పుట్టినరోజు కానుకగా డిసెంబర్ 17న ఉదయం 9.45 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఇక ఈ సినిమా శ్రీమురళికి గొప్ప పేరు తెచ్చిపెడుతుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది.

# అడవిశేషు ఫస్ట్ లుక్ విడుదల

రీసెంట్‌గా శేష్ ఈఎక్స్ శృతి అంటూ అడివి శేష్ కలిసి నటిస్తున్నట్లుగా ఓ అప్‌డేట్ వైరల్ అయిన విషయం తెలిసిందే. వారిద్దరూ కలిసి నటిస్తోన్న ఈ మెగా పాన్-ఇండియా యాక్షన్ డ్రామా నుంచి మేకర్స్ గురువారం సెన్సేషనల్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ అడివి శేష్ గ్రిప్పింగ్ క్యారెక్టర్ రివీల్ పోస్టర్‌తో డిసెంబర్ 18న విడుదల కానుంది. తాజాగా మేకర్స్ విడుదల చేసిన అడివి శేష్ ఇంటెన్స్ లుక్.. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫస్ట్ ఇమేజ్‌లో తీక్షణమైన చూపులతో, ముఖాన్ని బ్లాక్ స్కార్ఫ్‌తో కప్పుకొని కనిపించారు అడివి శేష్. అతని కుడి చెవిలో బంగారు చెవిపోగులు, అతని నుదిటిని కప్పి ఉన్న లాంగ్ లాక్స్ లుక్‌కు స్టైల్, స్వాగ్‌ని జోడించాయి. ఆసక్తికరంగా, ఈ చిత్రంలో హీరోయిన్ శృతి హాసన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అడివి శేష్ ఫస్ట్ లుక్ చిత్రాన్ని పోస్ట్ చేసి తనని పరిచయం చేస్తున్నాము - అతని రాక ఆమె జీవితంలో తుఫానును తెస్తుందా? టైటిల్, ఫస్ట్ లుక్ డిసెంబర్ 18న అని రాశారు. 'సినిమాలోని ప్రతి ఫ్రేమ్, డైలాగ్, సన్నివేశాన్ని హిందీతో పాటు తెలుగులో విడివిడిగా చిత్రీకరిస్తున్నాం. ప్రతి భాష సాంస్కృతిక ప్రత్యేకత బట్టి దీనిని విభిన్నంగా ట్రీట్ చేస్తున్నాం' అని మేకర్స్ ఇప్పటికే తెలియజేశారు. హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కనున్న ఈ మెగా ప్రాజెక్ట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, అమెరికాలో పుట్టి పెరిగిన షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.



# యానిమల్ సినిమాతో స్టార్ బన్‌గయా



ఇప్పుడు సెలబ్రిటీ పేర్లలో ఎక్కువగా ఎవరని అంటే త్రిప్తి డిమ్రీ అని అంటున్నారు. ఈమె పేరు కొన్ని రోజులవరకు అంతగా ఎవరికీ తెలియదు, కానీ 'యానిమల్' సినిమా విడుదలయ్యాక రాత్రికి రాత్రే స్టార్ అయ్యారు. ఇంతకీ ఈమె ఆ సినిమాలో కథానాయికగా నటించలేదు, రెండో సగంలో మాత్రమే చిన్న పాత్రలో కనపడుతుంది. మరి ఈమెకి ఎందుకు క్రేజ్ అంటే, ఆమె చేసిన సన్నివేశం అటువంటిది మరి.

త్రిప్తి డిమ్రీ 'యానిమల్' లో కథానాయకుడు రణబీర్ కపూర్ తో ఒక నగ్న సన్నివేశంలో నటించి సంచలనం సృష్టించింది. అంతకు ముందు ఆమె కొన్ని హిందీ సినిమాలు, అలాగే వెబ్ సిరీస్ చేసినా ఆమెకి ఇంతగా పేరు రాలేదు, కానీ ఈ 'యానిమల్' సినిమాలో చేసిన ఆ ఒక్క సన్నివేశానికి ఆమెకి విశేష గుర్తింపు వచ్చేసింది. దీంతో ఇప్పుడు అంతా ఆమె ఎవరు అంటూ వెతుకులాట ప్రారంభించారు.

'యానిమల్' సినిమాలో కథానాయికగా రష్మిక మందన్న వేసింది, ఆమెని అందరూ 'నేషనల్ క్రష్' అంటారు. అయితే ఈ సినిమా విడుదలయ్యాక, రష్మిక తో పాటు ఈ త్రిప్తి డిమ్రీని కూడా అందరూ 'నేషనల్ క్రష్' అని అంటున్నారు. నేషనల్ క్రష్ చెల్లెలు అని, ఇలా ఏవేవో పేర్లు పెట్టి ఈమె ఎక్కడ ఏమి మాట్లాడినా అది ఇప్పుడు వైరల్ చేస్తున్నారు. త్రిప్తి డిమ్రీకి ఈ సినిమా విడుదలయ్యాక వేలల్లో ఫాలోవర్స్ పెరిగారని తెలుస్తోంది. ఆమెకి ఇంతకు ముందు సాంఘీక మాధ్యమంలో తక్కువగా ఫాలోవర్స్ ఉంటే, ఈ సినిమా విడుదలయ్యాక ఒక్కసారిగా పెరిగిపోయారని తెలుస్తోంది. ఇన్స్టాగ్రామ్ లో ఈమెకి ఇప్పుడు 30 లక్షల 70 వేలుకి పైగా ఫాలోవర్లు వున్నారు.